

ఇవే గుర్తుపెట్టుకోండి : గుర్తులను చూపుతున్న పవన్‌కల్యాణ్

వారాహికి.. జన హారతి

నిడదవోలు : పవన్‌కల్యాణ్‌కే కాదు.. పవన్‌కల్యాణ్ వాహనం వారాహికి విశేష స్పందనే... నిడదవోలు గణేష్ చౌక్ సెంటర్‌లో బుధవారం జరుగుతున్న వారాహి విజయభేరి సభకు వచ్చిన వారాహి వాహనాన్ని తిలకించేందుకు అటు టీడీపీ, ఇటు జనసేన, బీజేపీ శ్రేణులు సాయంత్రం ఐదు గంటలకే పెద్దఎత్తున తరలివచ్చారు. తొలిసారి నిడదవోలు విచ్చేసిన వారాహి వాహనానికి అభిమానులు హారతులు పట్టారు. వారాహి వాహనం రాకతో నిడదవోలు గణేష్‌చౌక్ సెంటర్ అంతా సభ ప్రారంభానికి ముందుగానే జనసంద్రంగా మారింది.



నిడదవోలు సభకు వేలాదిగా హాజరైన జనం

జనసేనానులు



జనసేనలో చేరుతున్న డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి

చంద్రబాబు..పవన్‌కు నీరాజనం

- నిడదవోలు సభకు పోటెత్తిన జనం
- 20 వేల మందిపైగా వచ్చారని అంచనా
- దద్దరిల్లిన సభా ప్రాంగణం

రాజమహేంద్రవరం/నిడదవోలు/ఉండ్రాజవరం,ఏప్రిల్ 10 : జనసేనానుల రాకతో ఎటు చూసినా జనం.. జనం.. నిడదవోలు ప్రజాగళం సభ దద్దరిల్లింది. వారాహి విజయభేరిగా ఈ సభ మార్మోగింది. తొలిసారిగా ఒకే వేదిక మీద ఎన్నికల సభలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కలిసి గర్జించడంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో భలే ఊపు వచ్చింది. నిడదవోలు పట్టణంలోని గణేష్‌చౌక్ సెంటర్ అంతా జనసంద్రంగా మారింది. సాయంత్రం ఐదు గంటల నుంచే పరిసర గ్రామాల నుంచి ప్రజలు ప్రజాగళం సభకు భారీగా తరలివచ్చారు.నాయకులు మాట్లాడుతున్నంతసేపు జైచంద్రబాబు, జైపవన్‌కల్యాణ్ అంటూ ప్రజలు ఆ పార్టీ జెండాలతో సందడి చేస్తూనే ఉన్నారు.ఈ జనాన్ని చూసి చంద్రబాబు మిమ్మల్ని చూస్తుంటే నాకు అర్థం అయిపోయింది. జగన్‌ను ఇంటికి పంపడానికి మీరు ఇప్పటికే నిర్ణయం చేశారు.మే 13 ఇక లాంఛనం మాత్రమే అనడం గమనార్హం. ఈ మూడు పార్టీలు ఎందుకు కలిశాయో పవన్‌కల్యాణ్ వివరించి చెప్పడం గమనార్హం. దుర్మార్గుడైన జగన్‌ను ఓడించడం కోసం, యువత ఉపాధి కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఐక్యమయ్యాయన్నారు. కూటమి అధికారంలోకి రాగానే సమస్యలను చకచకా పరిష్కరిస్తామన్నారు. ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి మాట్లాడుతూ ఎన్డీఏ విజయంతో రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు పెద్ద మనస్సుతో ఇక్కడ జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్ పోటీ చేయడానికి సహకరించినందుకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు. నిడదవోలు చిన్న కాశీ రేవుకు వెళ్లే వంతెన నిర్మాణంతోపాటు వంద పడకల ఆసుపత్రి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. డంపింగ్ యార్డు సమస్యను పరిష్కారం చేస్తాం. గోదావరి జలాలను పట్టణ ప్రజలకు అందేలా చర్యలు చేపడతాం. ఇండోర్ స్టేడియం నిర్మిస్తాం. నిడదవోలు, సమిశ్రగూడెం మధ్యలో ఉన్న పురాతన హేవ్‌లాక్ బ్రిడ్జి స్థానంలో కొత్తది నిర్మిస్తాం. కంసాలిపాలెం -మాధవరం బ్రిడ్జిని పునరుద్ధరిస్తామని పవన్ చెప్పారు. నిడదవోలు మండలంలోని ఆంజనేయపురం, శింగవరంలో చంద్రబాబునాయుడు నిర్మించిన టిడ్కో ఇళ్లను కూటమి ప్రభుత్వం రాగానే లబ్ధిదారులకు అందిస్తాం. పెరవలిలో బస్టాండ్ నిర్మిస్తాం. పెరవలి ప్రభుత్వాసు పత్రిలో నేషనల్ హైవే వద్ద అడ్డుగా ఉన్న కటింగ్‌ను తొలగించి రోడ్డును అభివృద్ధిచేసి ప్రజలు, అరటి రైతులకు అనుకూలంగా మారుస్తాం. కానూరు-నడిపల్లి-తణుకు రోడ్డును ఆధునికీకరిస్తాం. ముక్కామల పెరవలి రహదారిని ఆధునికీకరిస్తాం.మల్రిపాలెం బ్రిడ్జిని విస్తరింపజేస్తాం. జగన్ పాలనలో నిడదవోలు నియోజకవర్గ పరిధి లోని రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయి. తమ కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల సమయంలోనే రోడ్ల నిర్మాణం చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. 3 నెలల్లో నియోజకవర్గంలో రహదారులను అభివృద్ధి పరుస్తామన్నారు.నిడదవోలు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ మాట్లాడుతూ వారాహి విజయభేరి సభలో వారాహి వాహనంపై రెండు సింహాలు నిలబడ్డాయన్నారు. ఓపక్క నారా వారి సింహం, మరోపక్క కొణిదెల వారి సింహం అప్రజాస్వామిక పరిపాలన చేస్తున్న వైసీపీని తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రం అన్ని విధా లా అభివృద్ధి చెందాలంటే ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఉమ్మడి ఎంపీ అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరి, ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా కందుల దుర్గేష్‌లను కమలం, గాజు గ్లాసు గుర్తులపై ఓటేసి ప్రజలు ఆశీస్సులు అందించాలన్నారు.నిడదవోలు వారాహి సభలో పట్టణ ప్రముఖ వైద్యులు. డాక్టర్ తోపరాల కల్యాణచక్రవర్తికి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిడదవోలు పట్టణ వైసీపీ నాయకుడు గంటా శ్రీనివాస్, వైసీపీ మాజీ కౌన్సిలర్ గంటా నాగ శాంతికుమారి తదితరులను పవన్ జనసేనలోకి ఆహ్వానించారు.


అడుగడుగునా అభిమానం

పశ్చిమగోదావరి జిల్లా తణుకులో రాత్రి 7 గంటలకు ప్రజాగళం సభ ముగించుకుని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రోడ్డు మార్గాన నిడదవోలు బహిరంగ సభకు బయలుదేరారు. తణుకులో రోడ్‌షో ముగిసిన తరువాత సుమారు 20 కిలోమీటర్లు ఒకే వాహనంపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు నిడదవోలు చేరుకున్నారు. సుమారు 8-43 గంటలకు నిడదవోలు సభావేదిక వద్దకు చేరుకున్నారు. వారాహి వాహనం ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు. నిర్ణీత సమయానికంటే గంటకు పైగా అధినేతల రాక ఆలస్యమైనప్పటికి జనం ఉత్సాహంగా రాత్రి 10 గంటల వరకు అక్కడు ఉండడం గమనార్హం. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోకి వచ్చేసరికి వారికి ఇరుపార్టీల శ్రేణులు ఘనస్వాగతం పలికారు. పాలంగి, ఉండ్రాజవరం, మోర్త, దమ్మెన్ను, కానూరు, డి.ముప్పవరం మీదుగా నిడదవోలు వెళ్లారు. ఉండ్రాజవరంలో మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. నిడదవోలు రూరల్ మండలం మునిపల్లి గ్రామంలో మహిళలు నేతలిద్దరిపై పూలు జల్లారు. డి.ముప్పవరంలో కూడ ప్రజలకు అభివాదం చేస్తూ సుమారు 7.45 గంటలకు నిడదవోలు పట్టణంలో గణేష్‌చౌక్ సెంటర్‌లో ఉన్న వారాహి విజయభేరి సభకు చేరుకున్నారు. ఉండ్రాజవరం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మోటార్ సైకిళ్లపై కాన్వాయ్ వెంట వచ్చారు. ఒకే వాహనంపై రోడ్‌షో నిర్వహిస్తున్న చంద్రబాబు, పవన్‌లకు ప్రజలు విజయ సంకేతం చూపారు. 8.45 గంటలకు వారాహి వేదిక మీదకు వచ్చిన టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, నిడదవోలు నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. 8.45 గంటలకు ప్రారంభమైన వారాహి విజయభేరి సభ 9.50 గంటలకు ముగిసింది. 20 వేల మందికిపైగా జనం రాకతో వారాహి విజయభేరి సభ విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కేఎస్ జవహర్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, నిడదవోలు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి భోగవల్లి ప్రసాద్, సుజయ కృష్ణరంగారావు, గన్ని వీరాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, పితాని సత్యనారాయణ, బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, బొమ్ముల దత్తు తదితరులు పాల్గొన్నారు.



నేడు అంబాజీపేట, అమలాపురంలలో
బాబు, పవన్ షో!

అమలాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రజాగళం పేరుతో గురువారం టీడీపీ,జనసేన అధినేతలు నారా చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ రోడ్ షో,బహిరంగ సభలు నిర్వహించనున్నారు.అధినేతల ఎన్నికల ప్రచార కార్యక్రమానికి అంబాజీపేట,అమలాపురం ప్రాంతాలు వేదిక కానున్నాయి. నిడదవోలులో బుధవారం రాత్రి బహిరంగ సభ అనంతరం తిరుమలసాయి కల్యాణమండపంలో బస చేస్తారు.ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకూ రంజాన్ వేడుకల్లో పాల్గొంటారు.1.30 గంటల వరకు పార్టీ నాయకులతో సమీక్ష, చేరికలు ఉంటాయి. అనంతరం 2.30 గంటల వరకూ గంట పాటు భోజన విరామం. పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 3 గంటలకు బ్రాహ్మణగూడెం నుంచి హెలికాఫ్టర్‌లో చంద్రబాబు బయలుదేరతారు. పవన్ కల్యాణ్ రాజమహేంద్రవరంలోని హోటల్ షెల్టాన్ నుంచి బయలుదేరతారు. వీరిద్దరూ గురువారం మధ్యాహ్నానికి అంబాజీపేటలో వేర్వేరుగా ఏర్పాటుచేసిన హెలిపాడ్‌లకు చేరుకుంటారు. జనసేనకు పట్టున్న అమలాపురం, పి.గన్నవరం నియోజకవర్గాల్లో తొలి విడత పర్యటనలో భాగంగా ఇద్దరు నేతలు గురువారం పర్యటించి ఆయా పార్టీల కేడర్‌లో జోష్ నింపనున్నారు.ఈ సభలను విజయవంతం చేయాలని కోరుతూ ఏర్పాటుచేసిన ప్రచార రథాలను జనసేన నేత ఆకుల బుజ్జి ఆధ్వర్యంలో టీడీపీ అమలాపురం అభ్యర్థి ఆనందరావు ప్రారంభించారు. బుజ్జి ఆధ్వర్యంలో మోటారు సైకిల్ ర్యాలీ కూడా చేపట్టారు.ఎక్కడికక్కడే టీడీపీ, జనసేన నాయకులు గురువారం జరిగే ఉభయ నేతల సభకు భారీగా జనాన్ని తరలించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. అంబాజీపేటలో బహిరంగ సభ ముగిసిన తరువాత చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఒకే వాహనంలో అక్కడి నుంచి రోడ్ షో నిర్వహిస్తూ అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిర్వహించే సభాస్థలికి చేరుకుంటారు. సుమారు 6 కిలోమీటర్ల మేర జరిగే రోడ్ షోకి జనం భారీగా హాజరవుతారని అంచనా వేస్తున్నారు. అమలాపురం బహిరంగ సభ ముగిసిన తరువాత టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కిమ్స్‌లో నైట్‌హాల్ట్ చేస్తారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు చంద్రబాబు కిమ్స్‌లోనే ఉండి అమలాపురం లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పార్టీ పరిస్థితులపై జిల్లా నాయకులతో చర్చిస్తారని సమాచారం.



మీకు మేమున్నాం : బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు



సభకు హాజరైన టీడీపీ నాయకులు



అభిమాన జెండా : జనసేన జెండాలతో పవన్ అభిమానులు



పవన్ అన్న వెంటే : పవన్ చిత్రాలతో యువత



రాత్రి బస ఇక్కడే..

నిడదవోలులోని శ్రీ తిరుమల సాయి కళ్యాణ మండపంలో చంద్రబాబు బుధవారం రాత్రి బస చేశారు. గురువారం ఉదయం జిల్లా నేతలతో సమీక్షించి అంబేద్కర్ కోనసీమ జిల్లాకు వెళతా రు.జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కారులో బయలుదేరి రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌లో రాత్రి బస చేశారు.

పసుపు చంద్రయ్య

తెలుగుదేశం అంటే ప్రాణం. ఆనాడు అన్న ఎన్‌టీఆర్ నుంచి నేడు చంద్రబాబు వరకు ఎక్కడ టీడీపీ సభలు, సమావేశాలు జరిగినా అతను విధిగా హాజరవుతాడు.. అతని వస్త్రాలే కాదు.. బండి సైతం పసుపు మయం. చాగల్లు మండలం నందింగంపాడుకు చెందిన చిట్టూరి జలచంద్రయ్య బుధవారం నిడదవోలులో గణేష్‌చౌక్ సెంటర్‌లో జరుగుతున్న వారాహి విజయభేరి సభకు తాను మోటారుసైకిల్‌ను సైతం పసుపుమయం చేసుకుని జయహో చంద్రన్నా... జయహో పవనన్నా.. అంటూ ఇలా సభకు తరలి వచ్చాడు.





పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ జగదీశ్, డీఎస్పీలు, ఆటోవాలాలు

సమాజసేవలో ఆటోవాలాలు భాగస్వాములు కావాలి

ఎస్పీ జగదీశ్ వినూత్న ప్రయోగం

ఊరెళితే డయల్ 94932 06371

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సమాజానికి మేలు చేసే విషయంలో ఆటోవాలాలు భాగస్వాములు కావాలని ఎస్పీ జగదీశ్ పిలుపునిచ్చారు. రహదారి, ఇళ్ల తదితర వాటికి సంబంధించిన భద్రతపై ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. హెల్మెట్, సీట్ బెల్టు ధరించడం, లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్ ఎంఎస్) ద్వారా ఇంటికి భద్రత కల్పించుకోవడం, అతివేగం ప్రమాదకరం వంటి అంశాలకు సంబంధించి సుమారు 5 వేల పోస్టర్లను ఆవిష్కరించి పలు ఆటోలకు స్వయంగా ఎస్పీ అతికించారు.భద్రత అంశాలపై ప్రజలను చైతన్యం చేయాలని ఆటో డ్రైవర్లను కోరారు. ప్రజలు తమ ప్రయాణాలకు ఆటోలను ఎక్కువగా ఆశ్రయిస్తుంటారని, అందువల్ల భద్రత విషయాలపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 112కి లేదా దగ్గరలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏదైనా ఊరు వెళ్లే సమయంలో పోలీసులు ఉచితంగా అందించే ఎల్‌హెచ్‌ఎంఎస్ సర్వీసును ఉపయోగించుకోవడం ద్వారా దొంగతనాల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. ప్రమాదాలు జరిగిన సమయంలో బాధ్యతగా ప్రవర్తించి బాధితులను ఆస్పత్రికి చేర్చడం వల్ల ఎన్నో ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఆ విషయంలో పోలీసుల నుంచి ఎలాంటి ఇబ్బందులూ ఉండవని స్పష్టం చేశారు. ఈ ఏడాది మార్చి చివరి వరకూ జిల్లాలో 169 ప్రమాదాలు సంభవించగా 60 మంది చనిపోయారన్నారు.ద్విచక్ర వాహనాల ప్రమాదాలు 74 ఉండగా 24 మంది ప్రాణాలు కోల్పోయారని, కార్లు తదితర లైట్ మోటారు వెహికిల్స్ వల్ల 44 ప్రమాదాలు జరగ్గా 10 మంది దుర్మరణం చెందారని తెలిపారు. హెల్మెట్ పెట్టుకోకపోవడం, సీట్ బెల్టు ధరించకపోవడం కారణంగానే మృతుల సంఖ్య ఎక్కువగా ఉంటోందన్నారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించడాన్ని వాహన చోదకులు అలవాటు చేసుకోవాలన్నారు.ద్విచక్ర వాహనంపై ట్రిపుల్ రైడింగ్‌ని తీవ్రంగా పరిగణిస్తామన్నారు. ఆటోవాలాలు మితిమీరిన విధంగా ఎక్కించుకో వద్దన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ కోసం 94932 06371, 99084 54580 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్ర మంలో అడిషనల్ ఎస్పీలు ఎస్ఆర్.రాజశేఖర్‌రాజు, టి.సర్కా ర్, ఎల్.చెంచిరెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగులకు అందని వేతనాలు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రియల్ 10 : డైరెక్టరీ ఆఫ్ సెకండరీ హెల్త్‌లో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులకు నేటికీ వేతనాలు చెల్లించకపోవడంతో వారంతా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్‌లో ఉన్న వైద్య ఉద్యోగులను డైరెక్టరీ ఆఫ్ సెకండరీ హెల్త్‌లోకి తీసుకొచ్చారని, అయితే 010 పద్దు ద్వారా జీతాల చెల్లింపులో జాప్యం ఉద్యోగులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఉగాదికైనా జీతాలు వస్తాయని ఎదురుచూసినా రాలేదని, రంజాన్‌కు కూడా జీతాలు వచ్చే అవకాశం కనిపించడంలేదన్నారు. జీతాలు రాక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెగ్యులర్ ఉద్యోగులు సుమారు 550 మంది, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు మరో 650 మందికి ఆర్థిక అవస్థలు తప్పడంలేదన్నారు. తక్షణమే జీతాలు చెల్లించాలని కోరారు.

నేడు రంజాన్



రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10: ముస్లిం సోదరులు రంజాన్ పండుగను గురువారం నిర్వహించనున్నారు. గురువారం తెల్లవారుజామునతో ఉపవాస దీక్షలు ముగుస్తాయి. ఈ సందర్భంగా రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకునేందుకు ముస్లిం సోదరులు ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మసీదులను ముస్తాబు చేశారు. మసీదులన్నీ విద్యుద్దీలతో అలంకరించారు. రాజమహేంద్రవరంలో రాయల్ మాస్క్ పెద్ద మసీదుతో పాటు అన్ని మసీదులను రంజాన్‌కు సిద్ధమయ్యాయి.



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత చిత్రంలో జేసీ తేజ్‌భరత్

సమన్వయంతో పనిచేద్దాం : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10: సమన్వయంతో పని చేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేద్దామని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత సూచించారు. రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్‌లో ఏడు నియోజకవర్గాల ఏఎల్ఎంటీల శిక్షణకు బుధవారం హాజరై మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ నియోజక మాస్టర్ ట్రైనర్లు నిర్వర్తించే పాత్ర అత్యంత కీలకమన్నారు. మాస్టర్ ట్రైనర్లు అందజేసే సమగ్ర సమాచారం, దిశా నిర్దేశం ద్వారా మాత్రమే ఎన్నికల విధుల్లో ప్రిసైడింగ్ , సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సహాయక సిబ్బంది పనితీరు ఆధారపడుతుందన్నారు. మీరు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు సమగ్రంగా అధ్యయనం చేసుకోవడం, వాటిని ఆచరణ సాధ్యం చేయడంలో మీ అనుభవం అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటుందన్నారు. ఎన్నికల్లో వినియోగించే ఈవీఎం, ఇతర అనుబంధ పోలింగ్ యూనిట్స్ పనితీరు ,డిస్ట్రిబ్యూషన్, పోలింగ్ అనంతరం రిసెప్షన్ కేంద్రంలో కీలకమైన బాధ్యతలు నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు ఈనెల 15న తొలి శిక్షణ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.సమావేశంలో జేసీ తేజ్‌భరత్, కమిషనర్ దినేష్ కుమార్, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

రూ.2 లక్షలిస్తేనే..డెడ్‌బాడీ ఇస్తాం 7

పోటాపోటీగా నాటిక ప్రదర్శనలు


చీకటి పువ్వు నాటికలోని ఓ సన్నివేశం

రావులపాలెం, ఏప్రిల్ 10: రావులపాలెం సీఆర్సీ కాటన్ కళా పరిషత్ వేదికపై రెండో రోజైన బుధవారం నాటిక పోటీలు పోటాపోటీగా సాగాయి. ప్రేక్షకులను ఆద్యంతం ఆకట్టుకున్నాయి. మొదటి నాటికగా చైతన్యకళాభారతి కరీంనగర్ వారి 'చీకటిపువ్వు' నాటికను ప్రదరించారు. రమేష్ మంచాల దర్శకత్వం వహించగా పరమత్ముని శివ రామ్ నాటకీకరణ చేశారు.. సురభి నాగరాజు సంగీతం, గానం అందించారు. ఆహార్యం, రంగాలంకరణ, లైటింగ్ వ్యవహారకర్తగా కేదారి నాగు ఉన్నారు. రెండో నాటికగా సిరిమువ్వ కల్చరల్స్ హైదరాబాద్ వారి 'థింక్'ను ప్రదర్శించారు. మంజునాథ్ రచన, దర్శకత్వం వహించారు. సురభి నాగరాజు సంగీతం సమకూర్చారు. ఆహార్యం మల్లాది గోపాలకృష్ణ వ్యవహరించారు. మూడో నాటికగా మల్లాది క్రియేషన్స్ హైదరాబాద్ వారి 'చీకట్లో చంద్రుడు' అనే హాస్య నాటికను ప్రదర్శించారు. మల్లాది రవికిరణ్, దర్శకుడిగా తేజోమూర్తుల మురళీధర్ వ్యవహరించారు. సంగీతం సురభి నాగరాజు అందించారు. ఆహార్యం బీవీ రావు వ్యవహరించారు. నాటికలన్ని ఆకట్టుకునే విధంగాను, సందేశాత్మకంగా ఉన్నాయి.

మే 19న సత్యదేవుని దివ్య కల్యాణం

- మే 18 నుంచి 24 వరకు కల్యాణోత్సవాలు
- గోటి తలంబ్రాల కార్యక్రమం రద్దు
- సమీక్షలో పలు నిర్ణయాలు తీసుకున్న అధికారులు


సమీక్ష నిర్వహిస్తున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, ఏప్రిల్ 10: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వార్షిక దివ్యకల్యాణోత్సవాల నిర్వహణపై బుధవారం ఈవో రామచంద్రమోహన్ అధ్యక్షతన వైదిక కమిటీ, అన్ని విభాగాల ఏఈవోలు, సూపరింటెండెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్రోధి నామ సంవత్సర స్వామి వారి దివ్య కల్యాణోత్సవాలు మే 18న వైశాఖ శుద్ధ దశమి రోజున స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలు చేయడంతో ప్రారంభమై 24న శ్రీపుష్పయోగంతో ముగుస్తాయి. 19న రాత్రి 9 గంటలకు అంగరంగ వైభవంగా దివ్య కల్యాణం నిర్వహిస్తారు. గతేడాది గోటి తలంబ్రాలుతో కల్యాణం అక్షింతలు తయారుచేయగా ఆ సంప్రదాయం అన్నవరం సత్యదేవుడికి లేనందున పూర్వపు పద్ధతిలో మామూలుగా కల్యాణ అక్షింతలు తయారుచేయాలని సుమారు 10వేల ప్యాకెట్లను సిద్ధం చేయాలని సూచించారు. అదే విధంగా గతేడాది స్వామి,అమ్మవార్ల శ్రీపుష్పయోగం ఆరుబయట వార్షిక కల్యాణవేదిక వద్ద చేపట్టడం దీనిపై విమర్శలు రావడం, పలువురు దీనిపై ఫిర్యాదులు చేయడంతో అనివేటి మండపంలో చేపట్టాలని నిర్ణయించారు. ఈ ఏడాది కల్యాణోత్సవాలకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయనాయకులకు ఆహ్వానాలు పంపకుండా దేవదాయ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను మాత్రమే ఆహ్వానించనున్నారు. కల్యాణోత్సవాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎక్కడికక్కడ క్యూలైన్‌లు పటిష్టపరిచి నిరంతరాయంగా తాగునీటి సరఫరా జరగాలని ఆదేశించారు. వైదిక కార్యక్రమాల నిర్వహణను వైదిక కమిటీ సంప్రదాయాలను గౌరవించి శాస్త్రోక్తంగా చేపట్టాలని దీనిని వైదిక కమిటీ సభ్యులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఆలయానికి రంగులు, విద్యుద్దీప అలంకరణల విషయంలో రాజీ పడొద్దని ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ విభాగ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా విభాగాల వారీగా కొన్ని లక్ష్యాలను నిర్దేశించారు. వచ్చేనెల మొదటి వారంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం అవుదాయని అప్పటికి నిర్దేశించిన లక్ష్యాలు 90శాతం వరకు పూర్తికావాలని ఆదేశించారు. స్వామివారి దివ్య కల్యాణోత్సవాలకు విస్తృత ప్రచారం కల్పించాలని పీఆర్వో కార్యాలయం దీనిని పర్యవేక్షించాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, పీఆర్వో దామెర కృష్ణారావు, ఏఈవోలు శ్రీనివాస్, జగ్గారావు, సూపరింటెండెంట్‌లు బలువు సత్యశ్రీనివాస్, ఐ.వి రామారావు, పర్వత నరసింహారావు, అనకాపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన తరపున ప్రచారం చేస్తా

పలు ఆలయాల్లో పూజలు నిర్వహించిన హీరో నవదీప్


శ్రీపాద శ్రీవల్లభ సంస్థానంలో నవదీప్, హీరోయిన్స్

పిఠాపురం, ఏప్రిల్ 10: పిఠాపురం అసెంబ్లీ నియోజవర్గం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కే తన మద్దతు అని, ఆయన తరపున ప్రచారం నిర్వహిస్తానని ప్రముఖ హీరో నవదీప్ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో లవ్ మౌళి ప్రేమ కథా చిత్రం యూనిట్ సభ్యులు బుధవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నవదీప్ మీడియాతో మాట్లాడుతూ నిజాయితీగా ఎవరు పోటీ చేసినా ప్రజలు ఆదరిస్తారని చెప్పారు. పవన్‌కు తన మద్దతు ఎల్లప్పుడు ఉంటుందని, అవసరమయితే ప్రచారానికి వస్తానని తెలిపారు. శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం చాలా బాగుందని, స్వామిని ప్రత్యక్షంగా కళ్లతో చూసినట్లు ఉందని చెప్పారు. గతంలో తాను ఆలయాలకు వెళ్లేవాడిని కానని, ఇప్పుడు వెళుతున్నానని తెలిపారు.

హీరో, హీరోయిన్లు పూజలు

లవ్ మౌళి ప్రేమ కథ చిత్రం హీరో నవదీప్ హీరోయిన్లు గిద్వాని, భావనలతో కలిసి మహాసంస్థానంలో పూజలు నిర్వహించారు. వారిని ఆలయ మర్యాదలతో అధికారులు సత్కరించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం నవదీప్ మాట్లాడుతూ ఈ సినిమాకు మూడేళ్లుగా ఎంతో కష్టపడి ఇష్టంతో పనిచేశానని తెలిపారు. సినిమా బాగా వచ్చిందని, ప్రేక్షకులు ఆదరిస్తారని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. ఈ నెల 19వ తేదీన సినిమా రిలీజ్ అవుతుందని తెలిపారు. ప్రేమికులకు ఇది గుర్తుండే ఒక కానుకగా ఉంటుందన్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల్లోని థియేటర్లలో ప్రదర్శిస్తూ ప్రేక్షకుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నామని చెప్పారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

జగ్గంపేట, ఏప్రిల్ 10: జగ్గంపేట మండలం రామవరం వద్ద బైక్ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. బుధవారం జాతీయ రహదారిపై వీర వెంకటరమణ తన భార్యతో బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో వీర వెంకటరమణకు తీవ్రగాయాలై మృతి చెందాడు. అతడి భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై జగ్గంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగదు స్వాధీనం

తాళ్లరేవు, ఏప్రిల్ 10: అమలాపురం నుంచి కారులో తుని ప్రాంతానికి తీసుకువెళుతున్న రూ.2,74,000ను పి.మల్లవరం చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ రామశేషయ్య ఆధ్వర్యంలో చెక్‌పోస్టు అధికారులు బుధవారం పట్టుకున్నారు. పట్టుకున్న నగదును సీజ్‌చేసి కోరంగ పోలీసు స్టేషన్‌కు స్వాధీనం చేశారు. ఈ నగదుకు సంబంధించిన ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో కోరంగి ఎస్ఐ ఎస్.రవికుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష


దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 10: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రావులపాలెం మండలం పొడగట్లపల్లికి చెందిన బడే రవికుమార్-రామసత్యవేణి దంపతులు రూ.లక్ష విరాళం సమర్పించారు. దాతలకు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా బుధవారం ఒక్కరోజు ఆదాయం రూ.2,02,021 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు


మాట్లాడుతున్న సీతారాం

పరిహారం ఇవ్వలేని
జగన్‌ను ఓడించాలి

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంతెన

చింతూరు, ఏప్రిల్ 10 : పోలవరం పరిహారం, పునరావాసం కల్పించలేని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. చింతూరు మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పరిహారం పొందిన పోలవరం ముంపు భూములకు తాను అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి ఎకరాకు రూ. 5 లక్షల వంతున పరిహారం ఇస్తానని నమ్మబలికి చివరకు పునరావాసం కల్పించడంలో చేతులెత్తేసి కేంద్రం ఇస్తేనే తాను ఇవ్వగలనని చెప్పడం ముంపు వాసులందరూ వినే ఉంటారన్నారు. అటువంటి సీఎం మనకు అవసరమా అని ఆయన ప్రశ్నించారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో గొంతెత్తి ప్రశ్నించే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఆదివాసీల జీవితాలకు వెలుగునిచ్చే జీవో నంబరు 3 రద్దు విషయంలో కూడా సీఎం నోరు విప్పకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. నాయకులు సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పల్లపు వెంకట్, మొట్టం రాజయ్య, మడకం చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షలు కడితేనే..మృతదేహం ఇస్తాం

- ఓ కార్పొరేట్ ఆస్పత్రి దాష్టీకం
- వైరల్ ఫీవర్‌తో బాధితుడి చేరిక
- రూ.7.50 లక్షల వరకూ ఖర్చు చేసిన కుటుంబం
- మంగళవారం రాత్రి మృతి
- మృతదేహం అప్పగించని ఆసుపత్రి
- మిగిలిన రూ.2 లక్షలు కట్టాలని డిమాండ్


ఆస్పత్రి ప్రతినిధుల వద్ద బాధితుల ఆవేదన

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రి ప్రతినిధులు మానవత్వాన్ని మరిచి ప్రవర్తిస్తున్న తీరు దారుణాతిదారుణంగా ఉంది. వైద్యం కోసం వచ్చిన ఓ పేద వ్యక్తి మృతి చెందితే.. రూ.2 లక్షలు చెల్లిస్తేనే ఇస్తామంటూ మృతదేహాన్ని గదిలో పెట్టి తాళం వేయడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరవుతున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంతర్వేదికి చెందిన పాటి మోహన్‌రావు(58) వ్యవసాయం చేస్తుంటారు. ఆయనకు వైరల్ జ్వరం సోకడంతో గత నెల 23న కిమ్స్ (బొల్లినేని) హాస్పటల్‌కు తీసుకొచ్చారు. మూడు రోజులు ఐసీయూలో ఉంచి వైద్యం అందించారు. తర్వాత రూమ్‌కు మార్పు చేశారు. మళ్లీ పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్ పెట్టారు. కిడ్నీలు పని చేయడం లేదని డయాలసిస్ చేశారు. న్యూమోనియా తీవ్రంగా ఉందని చెప్పారు. ఈ క్రమంలో మోహన్‌రావు చనిపోయారని మంగళవారం రాత్రి 8గంటల ప్రాంతంలో కుటుంబీకులకు చెప్పారు. ఇంకా రూ.2 లక్షలు చెల్లిస్తే మృతదేహాన్ని అప్పగిస్తామన్నారు. అయితే అప్పటికే రూ.7.50లక్షల వరకూ చెల్లించామని.. ఇక తమ వద్ద డబ్బులు లేవని చెప్పడంతో వారితోనే ఫ్రీజర్ బాక్సు రప్పించి దానిలో మృతదేహాన్ని ఉంచారు. ఆ ఫ్రీజర్ బాక్సును ఓ గదిలో పెట్టి తాళం వేశారు. డబ్బులు కడితేనే మృతదేహం ఇస్తామని కరాఖండిగా చెప్పారు. దీంతో మృతదేహం ఇస్తే తీసుకెళ్తామని మంగళ వారం రాత్రి నుంచి ఆస్పత్రి వాళ్లను బాధితులు బతిమలాడుతూనే ఉన్నారు. అయినా ఫలితం లేకపోవడంతో బుధవారం రాత్రి కొంతమంది గురువారం వస్తామని వెనుతిరిగి స్వగ్రామానికి వెళ్లిపోయారు. అయితే గురువారం బాధితులు మృతదేహం కోసం ధర్నా చేసే అవకాశముందని సమాచారం.


మృతదేహాన్ని ఉంచిన గది

● ఇదేమి ఆరోగ్యశ్రీ!

మోహన్‌రావుకు ఆరోగ్యశ్రీ కార్డు ఉంది. అయితే ఆయనకు ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయలేదు. ఆయన వ్యాధికి తమ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీలో వైద్యం చేయలేమని, ఆ వ్యాధికి ఆరోగ్యశ్రీ వర్తించే ఆస్పత్రిలో అయితే ఫలితం ఉంటుందని మెలిక పెట్టారు. ఆస్పత్రిలో చేర్చుకున్న నాటి నుంచీ రోజుకు సుమారు రూ.40 వేల వరకూ వైద్యానికి ఖర్చయింది. ఆ సొమ్ములు అప్పులు చేసి తెచ్చామని బాధితులు చెబుతున్నారు. తమ దగ్గర డబ్బులు లేవని, ఏదో రకంగా తమకు సహాయం చేయాలని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్‌కు బుధవారం రాత్రి బాధితులు ఫోన్ చేశారు. ఇప్పటి వరకూ కట్టిన సొమ్ములు ఇప్పిస్తే మంచిదని, లేకుంటే మృతదేహాన్ని అయినా అప్పగించాలని కోరారు. ఇంటి వద్ద మహిళలు రోదిస్తూ ఎదురు చూస్తున్నారని చెప్పారు. కానీ కోఆర్డినేటర్ నుంచి ప్రశ్నలు తప్ప ఫలితం లేకపోయింది. పోలీసులు సైతం ఏ సహాయమూ చేయలేమనడంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అనుకుంటూ ఆస్పత్రి వద్దే బాధితులు విలపిస్తూ ఉన్నారు.

న్యాయం చేయండి : కిషోర్ కుమార్, కుమారుడు

మాది పేద కుటుంబం. మంచి వైద్యం అందుతుందని అప్పులు చేసి డబ్బులు చెల్లించినా ఫలితం లేకపోగా మృతదేహాన్ని ఇవ్వమంటున్నారు. రెండు రోజుల కిందట నుంచే పరిస్థితి విషమంగా ఉన్నా ఏదొకటి చేస్తూ నమ్మించారు. 30 గంటలు గడిచి పోయింది. మా నాన్నను కనీసం చూడనివ్వడం లేదు. ఆరోగ్యశ్రీ ఎందుకు పనిచేయదు. ఇది చాలా దారుణం. మాకు న్యాయం చేయాలి.

రామకృష్ణారెడ్డి కోసం నిరవధిక దీక్ష



అనపర్తి, ఏప్రిల్ 10: అనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ టిక్కెట్ కేటాయింపులో భాగంగా టీడీపీ తొలి జాబితాలో ప్రకటించిన విధంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేరును అభ్యర్థిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బిక్కవోలు మండలం కొంకుదురు గ్రామశాఖ అధ్యక్షుడు కర్రి వీర వెంకట సత్యనారాయణరెడ్డి అలియాస్ కలెక్టర్ బుధవారం గ్రామంలోని తన నివా సంలో నిరవధిక దీక్ష చేపట్టారు. దివంగత మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి చిత్రపటం వద్ద ఆయన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 ఏళ్లుగా నల్లమిల్లి కుటుంబం టీడీపీకి సేవలందించిందని, అనపర్తిలో విజయావకాశాలు ఉన్న టీడీపీని కాదని బీజేపీకి మార్పు చేయడం సరికాదన్నారు. అనపర్తి సీటును నల్లమిల్లికి మార్పు చేస్తూ ప్రకటన చేసే వరకు దీక్షను విరమించబోమన్నారు.

'టీడీపీ కండువాతో ప్రచారం చేయొద్దు'

అనపర్తిలో బీజేపీ అభ్యర్థి ప్రచారంపై టీడీపీ నాయకుల అభ్యంతరం


అభ్యంతరం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

బిక్కవోలు, ఏప్రిల్ 10: అనపర్తి బీజేపీ అభ్యర్థిగా ప్రకటించిన ఎం.శివరామకృష్ణంరాజు బుధవారం బిక్కవోలు నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అయితే ఆయన టీడీపీ కండువాలతో ప్రచారం ప్రారంభించడంతో పార్టీ గ్రామ అధ్యక్షుడు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి ఆధ్వర్యంలో నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తమ నేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని అనపర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారని, బీజేపీ నాయకులు రామకృష్ణంరాజును అభ్యర్థిగా ప్రకటించారని అయితే ఈ సీటుపై ఇంకా తర్జన భర్జనలు జరుగుతున్నాయని, అందువల్ల తమ పార్టీ కండువాలు కప్పుకుని ప్రచారం చేయవద్దని రాజుతో వాగ్వాదానికి దిగారు. రామకృష్ణారెడ్డి న్యాయం కోసం నల్లమిల్లికి అంటూ టీడీపీ కండువాలతోనే ప్రచారం చేస్తున్నారని, ఈ దశలో మీరు తమ పార్టీ కండువాలు కప్పుకుని ప్రచారం చేస్తే సహించబోమన్నారు. బీ-ఫారం ఎవరికి ఇస్తే అప్పుడు తామంతా వారి వెంటే ఉంటామన్నారు. దీంతో చేసేది లేక శివరామకృష్ణంరాజు కప్పుకున్న టీడీపీ కండువాను తీసి వేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుణ్ణం రమేష్, గొర్రెల త్రిమూర్తులు, రాయుడు రామచంద్రరావు, పెం టమాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని గద్దె దించడమే లక్ష్యం: శివరామకృష్ణంరాజు

వైసీపీ అరాచక పాలనను గద్దె దించడమే కూటమి లక్ష్యమని అనపర్తి బీజేపీ అభ్యర్థి ఎం.శివరామకృష్ణంరాజు తెలిపారు. బుధవారం ఆయన బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు జరిపి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి, కేంద్రంలో బీజేపీ విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట బీజేపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

భారీ చెప్పుల తయారీ


తయారు చేసిన భారీ చెప్పులతో చర్మకారుడు పెందుర్తి వెంకటేష్

మండపేట, ఏప్రిల్ 10: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన చర్మకారుడు పెందుర్తి వెంకటేష్ ఆరు అడుగుల ఎత్తు, మూడు అడుగుల వెడల్పుతో రెండు భారీ చెప్పులు తయారు చేశాడు. మండపేటలో ఒక చెప్పుల దుకాణం ప్రారంభించాలని నిర్ణయించిన ఒక వ్యక్తి ఇచ్చిన ఆర్డర్‌పై ఈ రెండు చెప్పులు తయారుచేసినట్టు వెంకటేష్ తెలిపాడు. షాపు ముందు డిస్‌ప్లే పెట్టడానికి ఈ చెప్పులు ఆ షాపు యజమాని తయారు చేయించాడు. రెండు చెప్పులు రెండు మోడల్స్‌లో తయారు చేసినట్టు వెంకటేష్ తెలిపాడు. ఒకటి వి టైపు, మరొకటి అత్తారింటికి దారేది సినిమాలో పవన్‌కల్యాణ్ వేసుకున్న మోడల్‌లో తయారు చేశాడు. ఈనెల రెండో తేదీ నుంచి వారం రోజులు రోజుకు మూడు గంటల చొప్పున శ్రమించి ఇద్దరి సహాయంతో ఈ చెప్పులు తయారుచేసినట్టు తెలిపాడు. చెప్పుల తయారీ కోసం రెక్సినా, పీఈఎల్ సోల్, లెదర్ వంటి మెటీరియల్‌ను ఉపయోగించినట్టు చెప్పాడు. ఒక్కో చెప్పు తయారు చేయడానికి రూ.5వేలు ఖర్చు అయిందన్నాడు. రాజారత్న సెంటరు సినిమా హాలు రోడ్డులో ఉన్న దుకాణం ముందు పెట్టిన అతిపెద్ద చెప్పులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

అప్పన్న చందనోత్సవం

చీఫ్ ఫెస్టివల్ అధికారిగా రామచంద్రమోహన్



అన్నవరం, ఏప్రిల్ 10: వచ్చేనెల 10న జరిగే సింహాచలం అప్పన్న చందనోత్సవానికి చీఫ్ ఫెస్టివల్ అధికారిగా అన్నవరం దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్‌ను నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తరాంధ్ర, ఇతర ప్రాంతాల నుంచి సుమారు రెండు లక్షల మంది విచ్చేసే ఈ ఉత్సవానికి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. గతేడాది చందనోత్సవానికి భక్తులు ఎన్నో ఇబ్బందులు పడి సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనం కలగకుండానే వెనుతిరిగి వెళ్లిపోవడం, ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేయడం తెలిసిందే. ఈ ఏడాది దేవదాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో సింహాచలం ఈవోగా పనిచేసి అనుభవం ఉన్న రామచంద్రమోహన్‌కు ఈ ఏడాది చీఫ్ ఫెస్టివల్ అధికారి బాధ్యతలను అప్పగించారు.





రాజమహేంద్రవరంలో రంజాన్ సందడి నెలకొంది. అన్ని మసీదులను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.. ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు..
● రాజమహేంద్రవరం సిటీ

కాగుతున్న కొండలు

గ్రామాలను కమ్మేస్తున్న పొగ





వై.రామవరం,ఏప్రిల్10: అల్లూరి జిల్లాలోని అటవీ ప్రాంతాల చుట్టూ గత వారం పదిరోజులుగా కొండలు తగలబడుతున్నాయి. ఆ పొగలు గ్రామాల్లోకి వ్యాపించడంతో మన్యం వాసులు ప్రతీరోజు తీవ్రమైన కళ్ల మంటలతో సతమతమవుతున్నారు. ఎండలు మండుతున్న వేళ కొండల్లో సంచరించే స్థానికులు నిప్పు పెట్టడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లుగా కొండల నుంచి కింద ఉన్న రహదారుల వరకు అగ్నిజ్వాలలు రగులుతున్నాయి. మొక్కలు, వివిధ రకాల పంటలు వేసుకుని జీవనాధారంగా బతుకుతున్న కొండపోడు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పలువురు ఆవేదన చెందుతున్నారు. అడవులను రక్షించండంటూ ప్రచారాల వరకే పరిమితమవుతున్న అటవీశాఖాధికారులు మంటలను అదుపు చేయడంలో చర్యలు తీసుకోవడం లేదని పలువురు గిరిజనులు ఆరోపిస్తున్నారు.

రేపు రంగంపేట మండల పరిషత్ సమావేశం

రంగంపేట, ఏప్రిల్ 10: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో బి.శ్రీరామరాజు తెలిపారు. బుధవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని, లేకుంటే చర్యలు నిమిత్తం శాఖాధికారులకు సిఫార్సు చేస్తామని చెప్పారు.

ఏజెన్సీ సమాచారం

ఎన్నికలపై గిరిజనులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివకుమార్

మోతుగూడెం, ఏప్రిల్ 10: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో డొంకరాయి ఎస్ఐ శివకుమార్ తన సిబ్బందితో డొంకరాయి- సీలేరు పోలీస్‌స్టేషన్ల సరిహద్దు గ్రామాలైన బిర్రిగూడ, వలసపల్లి, పులగొప్పు, జెండాకూపి గ్రామాల్లో పర్యటించి ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మే 13న ఎలక్షన్ జరుగుతుందని కావున ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఆ రోజు ఉదయాన్నే ఓటు వేసి ఎండ పడకుండా చూసుకోవాలని సూచించారు. మావోయిస్టులకు ఎటువంటి సహాయం చేయకూడదని, వారి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు అందించాలన్నారు. గంజాయి సాగు చేసినా, అమ్మినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం జెండాకూపి గ్రామ యువతకు వాలీబాల్ కిట్ అందజేశారు. ఏఎస్ఐ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్స్ కల్యాణ్, శ్రీనివాస్, కానిస్టేబుల్స్ పోసయ్య, కన్నప్ప రెడ్డి పాల్గొన్నారు.

మూగజీవికి ప్రాణం పోశారు



బయటకు వచ్చి నీరు తాగుతున్న ఎద్దు

కూనవరం,ఏప్రిల్10: ముళ్లకంప లోయలో చిక్కుకుని కొన్ని రోజులుగా విలవిల్లాడుతున్న ఓ మూగజీవిని స్థానికులు రక్షించారు. కూనవరం పంచాయతీ గోదావరి ఒడ్డున ఓ ముళ్లకంప లోయలో పదిరోజుల క్రితం ఎద్దు ప్రమాదవశాత్తు పడిపోయింది. పదిరోజుల నుంచి ఎద్దు యజమానికి ఎక్కడ వెతికినా కనిపించలేదు. అయితే బుధవారం కూనవరానికి చెందిన నాచుపల్లి వెంకన్న, నెల్లూరు కృష్ణ, బుజ్జా వెంకటేష్ గోదావరి వైపుగా వెళ్తా లోయలో పడి ఉన్న ఎద్దును చూశారు. తీవ్ర ఎండలతో విలవిల్లాడిన ఆ జీవి బక్కచిక్కిపోయింది. దీంతో ఆ ముగ్గురు ఎంతో శ్రమించి తాడు సహాయంతో లోయలో ఉన్న దాన్ని బయటకు తీశారు. బయటకు వచ్చిన ఎద్దు ఒక్కసారిగా గోదావరి వైపు పరుగెత్తి దాహార్తి తీర్చుకుంది. ఆ ముగ్గురిని గ్రామస్థులు అభినందించారు.

కూటమి అభ్యర్థుల ర్యాలీని విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కూనవరం, ఏప్రిల్10: ఈనెల 13న జరిగే కూటమి అభ్యర్థుల ర్యాలీని జయప్రదం చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కోరారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కూటమి నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 13న అరకు పార్లమెంటు కూటమి అభ్యర్థి కొత్తపల్లి గీత, రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థి మిరియాల శిరీష కూనవరం మండలంలో పర్యటించనున్నారన్నారు. వీరు ర్యాలీగా బయలుదేరి స్థానిక భాస్కర థియేటర్‌లో సభ నిర్వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రంపచోడవరం కన్వీనర్ పాయం వెంకయ్య, మాజీ ఎంపీ సోడే రామయ్య, ప్రకాష్, వైస్ ఎంపీపీ బండారు సాంబశివరావు, గడేసుల రంజిత్‌కుమార్, జనసేన మండలాధ్యక్షుడు దాసరి నరేంద్ర, సర్పంచ్ హేమంత్‌గాంధీ, బీజేపీ నాయకులు నోముల రామారావు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన గండిపోశమ్మ జాతర

దేవీపట్నం,ఏప్రిల్10: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి గండాలు గట్టెక్కించే గండిపోశమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని గొందూరు గ్రామ సోదె వారి ఆడపడుచు మాతృశ్రీ గండిపోశమ్మతల్లికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటీ అమ్మవారిని పట్టువస్త్రాలు, పూలతో ముస్తాబు చేసింది. గరగ నృత్యాలతో జాతర ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఐదురోజుల వరకు జాతర వైభవంగా కొనసాగుతుంది.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అభ్యర్థి శిరీషాదేవి

రంపచోడవరం, ఏప్రిల్ 10: స్థానిక మసీదులో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి మిరియాల శిరీషాదేవి బుధవారం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు ఆమెకు ఆశీస్సులు అందించారు.

అడ్డతీగలలో ఎంపీ అభ్యర్థి రోడ్‌షో

అడ్డతీగల, ఏప్రిల్ 10: అడ్డతీగలలో బీజేపీ అరకు పార్లమెంట్ అభ్యర్థి కొత్తపల్లి గీత బుధవారం రోడ్‌షో నిర్వహించారు. దేవి సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కొత్తపల్లి గీత మాట్లాడుతూ ఏజెన్సీలో అరాచక పాలనకు స్వస్తి పలకాలన్నారు. అడ్డతీగల మండలానికి చెందిన తనకు ఏజెన్సీలోని సమస్యలపై అవగాహన ఉందన్నారు. కూటమి అధికారంలోకి వస్తే కేంద్రం సహకారంతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీషాను గెలిపించాలన్నారు.

పర్యాటక అభివృద్ధిపై వైసీపీ నిర్లక్ష్యం

- టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసు
- రాజమహేంద్రవరంలో సైకిల్ ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10: ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం రాజమహేంద్రవరంలో పర్యాటక అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వస్తే రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఎన్ని కష్టాలు వచ్చినా టీడీపీ జెండాను వీడలేదన్నారు. అనంతరం సుమారు 500 సైకిళ్లతో రాజమహేంద్రవరం ఏవీఏ రోడ్డు, గోరక్షణపేట, జాంపేట, దేవిచౌక్, కంబాలచెరువు, ఈఎస్ఐ ఆసుపత్రి, సీతంపేట, మూలగొయ్యి, ఆర్యాపురం, గోకవరం బస్టాండ్, పుష్కరాలరేవు, కోటగుమ్మం సెంటర్, మెయిన్ రోడ్డు, డీలక్స్ సెంటర్, స్టేడియం రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా వీఎల్‌పురం వినాయకుడు గుడి వరకు ర్యాలీ సాగింది. ఆదిరెడ్డి శ్రీనివాస్, బీజేపీ నాయకుడు దగ్గుబాటి హితేష్ చెంచురామ్, జనసేన నగర ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ సైకిల్ తొక్కుతూ పాల్గొన్నారు. అనంతరం 36వ డివిజన్‌లో ఆదిరెడ్డి వాసు, దగ్గుబాటి హితేష్ ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయ చైర్మన్ యిన్నమూరి ప్రదీప్, కిలపర్తి శ్రీనివాస్, శెట్టి జగదీష్, నిమ్మలపూడి గోవింద్, నల్లం ఆనంద్, కర్రి సతీష్, సత్యనారాయణ, హరిత టూరిజం అధినేత భగవాన్, నక్కా దేవి వరప్రసాద్ పాల్గొన్నారు.

సాయిసంతోష్‌కు అభినందన.. ఉత్తరప్రదేశ్ లక్నోలో జరిగిన నేషనల్ మార్షల్ ఆర్ట్స్ గేమ్‌లో అండర్-16 79 కేజీల విభాగంలో స్వర్ణపతకాన్ని సాధించిన రాజమహేంద్రవరానికి చెందిన సాధనాల సాయిసంతోష్‌ను అభినందించారు.

వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యం: గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 9: వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. గుడ్ మార్నింగ్‌తో మీ ఇంటికి మీ గోరంట్ల కార్యక్రమంలో భాగంగా మండలంలోని బొమ్మూరు పరిధిలోని బాలాజీపేట, ఆదర్శనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎంఎల్ రాజు ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థి గోరంట్ల, కుమార్తె కంఠమనేని శిరీష, రాష్ట్ర వైద్య విభాగం కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవికిరణ్, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ ఐదేళ్లుగా రాష్ట్రంలో అభివృద్ధి జాడలేదని, పరదాల చాటున తిరుగుతున్నారే తప్ప ప్రజా సమస్యలు పట్టించుకున్న పాపాన పోవడం లేదని విమర్శించారు. రాష్ట్రం పురోగతి సాధించేందుకు కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో మత్స్యేటి ప్రసాద్, సప్పా అప్పారావు, యానాపు ఏసు, మజ్జి పద్మ, మార్ని వాసుదేవరావు, అడపా వరప్రసాద్, ఆళ్ళ ఆనందరావు, ఒంటెద్దు స్వామి, పిన్నింటి ఏకబాబు,శీలం గోవిందు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సతీమణిపై చర్యలు చేపట్టండి


రంగంపేట: వడిశలేరులో సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

- అనపర్తి సహాయ ఎన్నికల అధికారికి రామకృష్ణారెడ్డి ఫిర్యాదు

అనపర్తి ఏప్రిల్ 10: దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించరాదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రార్థనా మందిరాల్లో ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ప్రచారం చేశారని రామకృష్ణారెడ్డి బుధవారం అనపర్తి ఏఆర్వోకు ఫిర్యాదు చేశారు. పూర్తి ఆధారాలతో ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశానని, చర్యలు చేపట్టాలని అధికారులను కోరినట్టు ఆయన చెప్పారు.

కొమరిపాలెంలో 'న్యాయం కోసం నల్లమిల్లి'

నియోజకవర్గం మొత్తం ఒక ఎత్తయితే కొమరిపాలెం ఒక ఎత్తని, ఇక్కడ ప్రజలు ప్రేమిస్తే ప్రేమనందిస్తారని అణచివేయాలి చూస్తే అణచివేస్తారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా అనపర్తి అసెంబ్లీ సీటును కోల్పోయిన ఆయన చేపట్టిన న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమాన్ని బుధవారం బిక్కవోలు మండలం కొమరిపాలెంలో నిర్వహించారు. తన తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు పడాల రాము సునీత దంపతులు వారితో పాటు గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, మహాశక్తి తెలుగు మహిళలు పాల్గొన్నారు.

ఎన్నికలకు అందరూ సిద్ధంకండి

రంగంపేట, ఏప్రిల్ 10: రాబోయే ఎన్నికలకు అందరూ సమాయత్తం కావాలని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని వడిశలేరు, రంగంపేట, ముకుందవరం, సుభద్రంపేట గ్రామాల్లో ఆయన పర్యటించి బూత్‌ఇన్‌చార్జ్‌లు, నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీలో ఉండేది తానేనని, దీనికి సంబంధించిన సంకేతాలు ఎన్డీయే నాయకుల నుంచి తనకు వచ్చాయన్నారు. వైసీపీ నాయకులు మభ్య పెడుతున్నారని, అపోహలు నమ్మవద్దన్నారు. ప్రతి గ్రామంలో ఓటరులిస్టులను పరిశీలించి ఓటరులతో మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, నీలపాల త్రిమూర్తులు, వెంకటరామరెడ్డి, సుబ్బారెడ్డి, రాంబాబు, వెలుగుబంటి సత్తిబాబు, మాచిన వెంకన్నదొర, ఉండవిల్లి గిరిబాబు, బలిరెడ్డి దుర్గారావు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు తీరని ద్రోహం

- జయహో బీసీ సభలో టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు భరత్

గోకవరం, ఏప్రిల్10: వైసీపీ ప్రభుత్వ పాలనలో బీసీలకు తీరని ద్రోహం చేశారని టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు, బీసీ సంఘం నాయకుడు అడపా భరత్ ధ్వజమెత్తారు. మండలంలోని కొత్తపల్లిలో బుధవారం టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన జయహో బీసీ సభకు ఆయన మాట్లాడుతూ బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తూ మరోసారి రానున్న ఎన్నికల్లో మోసం చేసి ముఖ్యమంత్రి అయ్యేందుకు జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నాలుగున్నరేళ్లలో బీసీలకు సీఎం జగన్ చేసిన మేలేంటో చెప్పాలని డిమాండు చేశారు. రిజర్వేషన్లలో కూడా కోత విధించారని ఆరోపించారు. సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్ళించి బీసీల నోట్లో వైసీపీ ప్రభుత్వం మట్టి కొట్టిందని మండిపడ్డారు. బీసీల సంక్షేమమే లక్ష్యంగా ఎన్టీఆర్ టీడీపీని ఏర్పాటుచేసారని, అదే కోవలో చంద్రబాబు అనేక పథకాలు, పదవులతో గౌరవం కల్పించారన్నారు. బీసీలకు తగిన న్యాయం దక్కాలంటే రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. అలాగే గోకవరం, గుమ్మళ్ళదొడ్డి, రంపయర్రంపాలెం, తంటికొండ గ్రామాల్లో జయహో బీసీ సభలు జరిగాయి. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, తూము కుమార్, మంగరౌతు రాము, అడపా వెంకట్రావు, ఇడుదుల అర్జునరావు, ముదిలి రాజశేఖర్, పోతాబత్తుల శ్రీను, అడపా బంగారుబాబు, ఫణీంద్రకిషోర్, పోతుల మొహన్‌రావు పాల్గొన్నారు.


జయహో బీసీ సభలో మాట్లాడుతున్న అడపా భరత్

పేదల పక్షపాతి కాంగ్రెస్

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 10: పేదల పక్షపాతి కాంగ్రెస్ అని, హస్తం గుర్తుకు ఓటువేసి పార్టీని గెలిపించాలని రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి గిడుగు రుద్రరాజు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గ ఇన్‌చార్జి ముండ్రు శ్రీనివాస్‌తో కలసి తూర్పుగోనగూడెంలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. కాంగ్రెస్ హయాంలో ఏర్పాటు చేసిన ఈ విశ్వవిద్యాలయం పనులు పూర్తికాకపోవడం పట్ల విచారం వ్యక్తంచేసారు. అనంతరం తూర్పుగోనగూడెంలో ఓటర్లను కలసి రాష్ట్రంలో గాని కేంద్రంలో గాని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతీ రైతుకి రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని, ఉపాధిహామీ కూలి రూ.270 నుంచి రూ.400కు పెంచుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంకం గోపి, వైఏ వడయార్, కురెళ్ల చినబాబు, యాళ్ల మాచరయ్య, గణేష్, రాజమండ్రి సిటీ అభ్యర్థి బోడా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు, పవన్‌కు స్వాగతం.. వీడ్కోలు

కోరుకొండ, ఏప్రిల్ 10: మధురపూడి విమానాశ్రయం వద్ద టీడీపీ అధినేత చంద్రబాబుకు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు టీడీపీ, జనసేన నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. తణుకు, నిడదవోలులో జరిగే ప్రజాగళం రోడ్‌షోలో పాల్గొనేందుకు ఈ నేతలు ఇద్దరు బుధవారం సాయంత్రం 4గంటలకు వేర్వేరు విమానాల్లో మధురపూడి విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడ నుంచి వేర్వేరు హెలికాప్టర్లలో తణుకు, నిడదవోలు జరిగే సభలకు బయల్దేరి వెళ్ళారు. ఇరు పార్టీల అధ్యక్షులు విమానాశ్రయం వద్ద హైదరాబాద్ వచ్చేటప్పుడు మధురపూడికి వచ్చినప్పుడు స్వాగతం, మధురపూడి నుంచి తణుకు వెళ్ళినప్పుడు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మింగి లక్ష్మినారాయణ, వట్టికూడి ప్రసాద్, పాలచర్ల కృష్ణ, టీడీపీ సుబ్బు, జనసేన నాయకుడు అడ్డాల దొరబాబు తదితరులున్నారు.

జగన్ అరాచక మూకను తరిమికొట్టాలి

అరకు పార్లమెంట్ కూటమి అభ్యర్థి కొత్తపల్లి గీత


రోడ్‌షోలో మాట్లాడుతున్న గీత


పూజలు చేస్తున్న కొత్తపల్లి గీత

రంపచోడవరం, ఏప్రిల్ 10: గిరిజన వనరులను, హక్కులను హరించేస్తున్న జగన్ సర్కారు, ఆయన అనుచర మూకలను తరిమి కొట్టాలని, కూటమి అభ్యర్థులను గెలిపించాలని అరకు పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీత పిలుపునిచ్చారు. రంపచోడవరం మండలంలోని సీతపల్లి బాపనమ్మ ఆలయం నుంచి ఆమె ఎన్నికల ప్రచారానికి బుధవారం శ్రీకారం చుట్టారు. రంపచోడవరం టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీషతో కలిసి తొలుత అమ్మవారి ఆలయంలో పూజలు చేసుకుని ప్రచారంలో పాల్గొన్నారు. రంపచోడవరం మండలం మొదలుకొని గంగవరం, అడ్డతీగల మండలాలలో తొలిరోజున ప్రచారం పూర్తి చేశారు. ఈ మండలాల గ్రామాల్లో దారి పొడవునా రోడ్‌షోలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన సబ్‌ప్లాన్ నిధులను కూడా ఈ జగన్ సర్కారు దారి మళ్లించిందని, స్థానికంగా ఉన్న వనరులను సైతం జగన్ అనుచర వ్యక్తులు దోచేస్తున్నారని, మన్యంలో బెదిరింపు రాజకీయాలు నడుస్తున్నాయని కొత్తపల్లి గీత అన్నారు. అనంతరం గంగవరం, అడ్డతీగల మండలాల గ్రామాల్లో ఈ పర్యటన సాగింది. రంపచోడవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థిగా మిరియాల శిరీషను గెలిపించాలని ఆమె కోరారు.

నల్లమిల్లిలో బీజేపీ అభ్యర్థి ప్రచారం

రంగంపేట, ఏప్రిల్ 10: మండలంలోని నల్లమిల్లిలో బీజేపీ-టీడీపీ-జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి శిశ రామకృష్ణంరాజు ఇంటింటికీ వెళ్లి తిరుగుతూ కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోతుల పట్టివేత

గోపాలపురం, ఏప్రిల్ 10: కొన్ని రోజులుగా కోతుల సంచారం, ఇబ్బందిపడుతున్న గ్రామస్థులకు పంచాయతీ అధికారులు బుధవారం ఉపశమనం కలిగించారు. కోతులు గ్రామంలో సంచరించి ఇద్దరు చిన్నారులపై దాడి చేసి గాయపరిచాయి. దీంతో స్పందించిన అధికారులు కోతులను పట్టుకొని అడవిలో వదిలేశారు.

సమాజ దార్శనికుడు పూలే

జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారి సత్యరమేష్


కార్యక్రమంలో మాట్లాడుతున్న పిల్లి సత్యరమేష్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 10: విద్యా వివక్ష, పేదరికం, ఆర్థిక సమానత్వం నిర్మూలించడానికి పూలే ఎంతో కృషి చేశారని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి పిల్లి సత్యరమేష్ అన్నారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ, కళాగౌతమి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏబిల్ రాజబాబు, తెలుగుశాఖ అధ్యక్షుడు వీవీబీ సంజీవరావు, అధ్యాపకులు ఎస్.రాజ్‌కుమార్, పల్లి సుధా, సీవీ దినకర్, ఆర్.శ్రీనివాసరావు, దేశిరెడ్డి, వై.శ్రీనివాస్, చీర్ల సీతారామనాయుడు పాల్గొన్నారు.

గోరంట్లకు శాలివాహనుల మద్దతు


గోరంట్లను కలిసి మద్దతు తెలుపుతున్న శాలివాహన సంఘీయులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10: రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని శాలివాహన సంఘీయులు కలిసి తమ మద్దతు ప్రకటించారు. రాజమహేంద్రవరంలోని ఆయన నివాసానికి బుధవారం శాలివాహన కమిటీ చైర్మన్ దాలిపర్తి వేమన ఆధ్వర్యంలో సుమారు 50 మంది నాయకులు వెళ్లి గోరంట్లను కలిసారు. కార్యక్రమంలో పేరూరి గంగాధరం, మెరుగుమిల్లి సత్యనారాయణ, టీవీ రావు, మానేపల్లి తాతారావు, మంతెన శ్రీనివాసరావు, కపిలేశ్వరరావు, టిల్లపూడి శ్రీనివాస్, గాది శేఖర్, టిల్లపూడి వీరభద్రం, పేరూరి రాజా పాల్గొన్నారు.

టీడీపీ కోరుకొండ అధ్యక్షుడిగా దొరబాబు

కోరుకొండ, ఏప్రిల్ 10: టీడీపీ కోరుకొండ గ్రామ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షుడిగా కామిశెట్టి దొరబాబు, ప్రధాన కార్యదర్శిగా మాతా ప్రభు, ఉపాధ్యక్షులుగా కొచ్చెర్ల ఈశ్వరరావు, జాజుల సుబ్రహ్మణ్యం, మహిళా అధ్యక్షురాలిగా రాయభట్టు కృష్ణవేణి, జాజుల నారాయణమ్మ తదితరులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీనియర్ నాయకుడు మాతా సీతారాముడు, మైరెడ్డి రాంబాబు, కాళ్ళశ్రీ రాములు, శీలం ఏడుకొండలు, రేగడమిల్లి వీర్రాజు, మామిడిపాక శంఖం, గోపి, గుత్తి రవిబాబు పాల్గొన్నారు.

జై భీమ్ భారత్ పార్టీ రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థిగా కిరణ్‌కుమార్



ధవళేశ్వరం, ఏప్రిల్ 10: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జై భీమ్ భారత్ పార్టీ తరుపున రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థిగా ధవళేశ్వరానికి చెందిన దళిత నాయకుడు గునిపే కిరణ్‌కుమార్ పోటీ చేయనున్నారు. విజయవాడలో జరిగిన సమావేశంలో పార్టీ అధ్యక్షుడు జడ శ్రవణ్‌కుమార్ ఈ మేరకు ప్రకటించినట్టు కిరణ్‌కుమార్ తెలిపారు. అంబేడ్కర్ ఆశయాల సాధనకు ఎస్సీఎస్టీ, బీసీ మైనార్టీ బడుగు, బలహీన వర్గాలు తనకు మద్దతు తెలపాలని కోరారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు రాట ముహూర్తం

ధవళేశ్వరం, ఏప్రిల్ 10: ధవళేశ్వరం ఇరిగేషన్ కార్యాలయాల వద్ద బ్యారేజ్ కాలనీలోని కోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలకు బుధవారం పందిరి రాట ముహూర్తం చేశారు. పోలవరం చీఫ్ ఇంజనీర్ బి.సుధాకర్‌బాబు దంపతులు ప్రత్యేక పూజలు చేసి రాట వేశారు.

రాజానగరంలో 8 మంది వలంటీర్ల రాజీనామా

రాజానగరం, ఏప్రిల్ 10: రాజానగరంలో పలువురు గ్రామవలంటీర్లు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి మేకా ప్రసాద్‌బాబుకు బుధవారం అందజేశారు. జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి నాయకుల వైఖరి వల్ల తమ మనోభావాలు దెబ్బతిన్నాయని అందుకే రాజీనామా చేశామని వారు పేర్కొన్నారు. కాగా మరో రెండు రోజుల్లో నియోజవర్గ వ్యాప్తంగా ఉన్న గ్రామ వలంటీర్లంతా మూకుమ్మడి రాజీనామాలు చేసే యోచనలో ఉన్నట్టు తెలిసింది.

ధవళేశ్వరంలో నేత్ర దానం



ధవళేశ్వరం, ఏప్రిల్ 10: స్థానిక గంజాల వీధికి చెందిన గవర జోగినాయుడు(85) బుధవారం ఉదయం ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. ఆయన నేత్రాలు మరొకరి జీవితంలో వెలుగులు నింపాలనే ఉద్దేశ్యంతో ఆయన కుమారులు వరప్రసాద్, రమేష్‌లు నిర్ణయించారు. దీంతో నిడదవోలులోని రామయ్యమ్మ ఇంటర్నేషనల్ ఐ బ్యాంక్ సిబ్బంది వచ్చి మృతి చెందిన జోగినాయుడు కార్నియాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన కుమారులను పలువురు అభినందించారు.

ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోండి

రాజానగరం, ఏప్రిల్ 10: ఓటర్లంతా తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని ఎంపీడీవో జ్యోతిర్మయి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈవో రామన్నదొర మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనసేన ప్రచార వాహన ఫ్లెక్సీలు ధ్వంసం

ఇద్దరు యువకులపై కేసు నమోదు



రాజానగరం, ఏప్రిల్ 10: జనసేన పార్టీ ప్రచార వాహనానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన ఘటనలో ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. మండలంలోని తూర్పుగోనగూడెం గ్రామానికి చెందిన పైన దుర్గారావుకు చెందిన ఆటోను జనసేన పార్టీ ప్రచారానికి అద్దెకు తీసుకున్నారు. బుధవారం తెల్లవారుజామున ఇంటి వద్ద ఉన్న ఆటోపై ఏర్పాటు చేసిన జనసేన పార్టీ ఫ్లెక్సీలను గుర్తుతెలియని యువకులు చించివేశారు. ఈ సమయంలో శబ్దం రావడం గమనించిన ఆటో డ్రైవర్ భార్య బయటకు వచ్చి చూసేసరికి పరుగులు తీశారు. ఆటో డ్రైవర్ దుర్గారావు ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా తూర్పుగోనగూడెం గ్రామానికి చెందిన వీరమళ్ల జయ భువనసాయి, శ్రీరామ్‌నగర్‌కు చెందిన యర్రా తేజేష్‌లను నిందితులుగా గుర్తించారు. ఈ మేరకు ఎస్ఐ పవన్ కేసు నమోదు చేశారు.

అణగారిన వర్గంగానే రజకులు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కట్లయ్య

దేవరపల్లి, ఏప్రిల్ 10: రజకులు అన్ని రంగాల్లోనూ అణగారిన వర్గంగానే మిగిలిపోతున్నారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని చిన్నాయిగూడెంలో రజక సంఘం నాయకుడు గుంటుపల్లి నాంచారయ్య సంస్మరణ సభకు ఆయన విచ్చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రజకుల సమస్య సాధనకు నాంచారయ్య ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం గ్రామంలో రజ కుల సమస్యలను కట్లయ్య దృష్టికి తీసుకొచ్చారు. చెరువులను కట్లయ్య సందర్శించి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడానికి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. రజకులంతా ఐక్యంగా ఉంటేనే సమస్యలు సాధించుకోగలమని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక సంఘం ఉపాధ్యక్షుడు బూరుగుపల్లి సత్యనారాయణ, పల్లంట్ల సుబ్బారావు, పల్లంట్ల గాంధీ, కంబాల నాగేశ్వరరావు, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ పందిరి మహదేవుడు కోటిలింగాల సత్రం

రాజమహేంద్రవరం, తూర్పుగోదావరిజిల్లా, ఫోన్ నెం : 0883-2476959, 949100718

సీల్డు టెండరు -కమ్ - బహిరంగ వేలం ప్రకటన

రాజమహేంద్రవరం సిటీ, కోటిలింగాలపేటలో గల శ్రీపందిరి మహదేవుడు కోటిలింగాల సత్రం హక్కు భుక్తములో గల క్రింది తెలిపిన 2 షాపులకు మూడు సంవత్సరముల కాలపరిమితికి గాను లీజుకు ఇచ్చుటకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షములో సీల్డు టెండరు-కమ్- బహిరంగ వేలం నిర్వహించబడును.

వ.నెం.	వివరములు	తేదీ, సమయం, వేలం నిర్వహించు ప్రదేశం	ధరావత్తు సొమ్ము	లీజు కాలము
1	రాజమహేంద్రవరం, మెయిన్ రోడ్, డో. నెం : 9-20-77, షాపు నెం : 1, (L.- 29'-9", W- 5'-3")	ది.20.04.2024వ తేదీ శనివారం ఉదయం 11.00 గంటలకు శ్రీనాళం వారి సత్రం, మెయిన్‌రోడ్, రాజమహేంద్రవరం	25,000/-	1-5-2024 నుండి 30-4-2027 వరకు (3 సంవత్సరముల కాలమునకు)
2	పై చిరునామాలో షాపు నెం : 3 (L.-23'-2", W- 6'-4")			

ముఖ్య షరతులు : 1. బహిరంగ వేలం కమ్ సీల్డు టెండరు నందు పాల్గొనదలచినవారు హిందూ మతస్థులై ఉండవలెను. 2. ఈ పాట శ్రీయుత కమీషనరు, దేవదాయ ధర్మదాయ శాఖ గొల్లపూడి, విజయవాడ రూరల్, వారి మంజూరు ఉత్తర్వులకు లోబడి ఖాయపర్చబడును. 3. పాటలో పాల్గొనదలచిన వారు సదరు షాపును ముందుగా చూసుకొని పాటలో పాల్గొనవలయును. 4. పాటలో పాల్గొను పాటదారుడు తనకు గల స్థిరాస్థి వివరములను తెలియపరచు సాల్వెన్సీ రూ.3,00,000/-లు విలువగల ధృవపత్రమును సంస్థ కార్యనిర్వహణాధికారి వారికి వేలం పాటకు ముందు ఇవ్వవలెను. 5. ఇతర పాట షరతులు, టెండరు షెడ్యూలు మరియు ఇతర వివరములకు కార్యాలయం పనిచేయువేళలలో స్వయంగా గానీ, లేక ఫోన్ ద్వారా గానీ తెలుసుకొనవచ్చును.

ది. 10.04.2024

వి.వి.వశ్లంరాజు, బి.టెక్
సహాయకమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి





ఇవే గుర్తుపెట్టుకోండి : గుర్తులను చూపుతున్న పవన్‌కల్యాణ్



నిడదవోలు సభకు వేలాదిగా హాజరైన జనం

జనసేనానులు

వారాహికి.. జన హారతి

నిడదవోలు : పవన్‌కల్యాణ్‌కే కాదు.. పవన్‌కల్యాణ్ వాహనం వారాహికి విశేష స్పందనే... నిడదవోలు గణేష్ చౌక్ సెంటర్‌లో బుధవారం జరుగుతున్న వారాహి విజయభేరి సభకు వచ్చిన వారాహి వాహనాన్ని తిలకించేందుకు అటు టీడీపీ, ఇటు జనసేన, బీజేపీ శ్రేణులు సాయంత్రం ఐదు గంటలకే పెద్దఎత్తున తరలివచ్చారు. తొలిసారి నిడదవోలు విచ్చేసిన వారాహి వాహనానికి అభిమానులు హారతులు పట్టారు. వారాహి వాహనం రాకతో నిడదవోలు గణేష్‌చౌక్ సెంటర్ అంతా సభ ప్రారంభానికి ముందుగానే జనసంద్రంగా మారింది.



జనసేనలో చేరుతున్న డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి





చంద్రబాబు..పవన్‌కు నీరాజనం

- నిడదవోలు సభకు పోటెత్తిన జనం
- 20 వేల మందిపైగా వచ్చారని అంచనా
- దద్దరిల్లిన సభా ప్రాంగణం

రాజమహేంద్రవరం/నిడదవోలు/ఉండ్రాజవరం,ఏప్రిల్ 10 : జనసేనానుల రాకతో ఎటు చూసినా జనం.. జనం.. నిడదవోలు ప్రజాగళం సభ దద్దరిల్లింది. వారాహి విజయభేరిగా ఈ సభ మార్మోగింది. తొలిసారిగా ఒకే వేదిక మీద ఎన్నికల సభలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కలిసి గర్జించడంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో భలే ఊపు వచ్చింది. నిడదవోలు పట్టణంలోని గణేష్‌చౌక్ సెంటర్ అంతా జనసంద్రంగా మారింది. సాయంత్రం ఐదు గంటల నుంచే పరిసర గ్రామాల నుంచి ప్రజలు ప్రజాగళం సభకు భారీగా తరలివచ్చారు.నాయకులు మాట్లాడుతున్నంతసేపు జైచంద్రబాబు, జైపవన్‌కల్యాణ్ అంటూ ప్రజలు ఆ పార్టీ జెండాలతో సందడి చేస్తూనే ఉన్నారు.ఈ జనాన్ని చూసి చంద్రబాబు మిమ్మల్ని చూస్తుంటే నాకు అర్థం అయిపోయింది. జగన్‌ను ఇంటికి పంపడానికి మీరు ఇప్పటికే నిర్ణయం చేశారు.మే 13 ఇక లాంఛనం మాత్రమే అనడం గమనార్హం. ఈ మూడు పార్టీలు ఎందుకు కలిశాయో పవన్‌కల్యాణ్ వివరించి చెప్పడం గమనార్హం. దుర్మార్గుడైన జగన్‌ను ఓడించడం కోసం, యువత ఉపాధి కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఐక్యమయ్యాయన్నారు. కూటమి అధికారంలోకి రాగానే సమస్యలను చకచకా పరిష్కరిస్తామన్నారు. ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి మాట్లాడుతూ ఎన్డీఏ విజయంతో రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు పెద్ద మనస్సుతో ఇక్కడ జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్ పోటీ చేయడానికి సహకరించినందుకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు. నిడదవోలు చిన్న కాశీ రేవుకు వెళ్లే వంతెన నిర్మాణంతోపాటు వంద పడకల ఆసుపత్రి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. డంపింగ్ యార్డు సమస్యను పరిష్కారం చేస్తాం. గోదావరి జలాలను పట్టణ ప్రజలకు అందేలా చర్యలు చేపడతాం. ఇండోర్ స్టేడియం నిర్మిస్తాం. నిడదవోలు, సమిశ్రగూడెం మధ్యలో ఉన్న పురాతన హేవ్‌లాక్ బ్రిడ్జి స్థానంలో కొత్తది నిర్మిస్తాం. కంసాలిపాలెం -మాధవరం బ్రిడ్జిని పునరుద్ధరిస్తామని పవన్ చెప్పారు. నిడదవోలు మండలంలోని ఆంజనేయపురం, శింగవరంలో చంద్రబాబునాయుడు నిర్మించిన టిడ్కో ఇళ్లను కూటమి ప్రభుత్వం రాగానే లబ్ధిదారులకు అందిస్తాం. పెరవలిలో బస్టాండ్ నిర్మిస్తాం. పెరవలి ప్రభుత్వాసుపత్రిలో నేషనల్ హైవే వద్ద అడ్డుగా ఉన్న కటింగ్‌ను తొలగించి రోడ్డును అభివృద్ధిచేసి ప్రజలు, అరటి రైతులకు అనుకూలంగా మారుస్తాం. కానూరు-నడిపల్లి-తణుకు రోడ్డును ఆధునీకీకరిస్తాం. ముక్కామల పెరవలి రహదారిని ఆధునీకీకరిస్తాం.మల్రిపాలెం బ్రిడ్జిని విస్తరింపజేస్తాం. జగన్ పాలనలో నిడదవోలు నియోజకవర్గ పరిధి లోని రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయి. తమ కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల సమయంలోనే రోడ్ల నిర్మాణం చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. 3 నెలల్లో నియోజకవర్గంలో రహదారులను అభివృద్ధి పరుస్తామన్నారు.నిడదవోలు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ మాట్లాడుతూ వారాహి విజయభేరి సభలో వారాహి వాహనంపై రెండు సింహాలు నిలబడ్డాయన్నారు. ఓపక్క నారా వారి సింహం, మరోపక్క కొణిదెల వారి సింహం అప్రజాస్వామిక పరిపాలన చేస్తున్న వైసీపీని తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రం అన్ని విధా లా అభివృద్ధి చెందాలంటే ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఉమ్మడి ఎంపీ అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరి, ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా కందుల దుర్గేష్‌లను కమలం, గాజు గ్లాసు గుర్తులపై ఓటేసి ప్రజలు ఆశీస్సులు అందించాలన్నారు.నిడదవోలు వారాహి సభలో పట్టణ ప్రముఖ వైద్యులు. డాక్టర్ తోపరాల కల్యాణచక్రవర్తికి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిడదవోలు పట్టణ వైసీపీ నాయకుడు గంటా శ్రీనివాస్, వైసీపీ మాజీ కౌన్సిలర్ గంటా నాగ శాంతికుమారి తదితరులను పవన్ జనసేనలోకి ఆహ్వానించారు.

అడుగడుగునా అభిమానం

పశ్చిమగోదావరి జిల్లా తణుకులో రాత్రి 7 గంటలకు ప్రజాగళం సభ ముగించుకుని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రోడ్డు మార్గాన నిడదవోలు బహిరంగ సభకు బయలుదేరారు. తణుకులో రోడ్‌షో ముగిసిన తరువాత సుమారు 20 కిలోమీటర్లు ఒకే వాహనంపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు నిడదవోలు చేరుకున్నారు. సుమారు 8-43 గంటలకు నిడదవోలు సభావేదిక వద్దకు చేరుకున్నారు. వారాహి వాహనం ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు. నిర్ణీత సమయానికంటే గంటకు పైగా అధినేతల రాక ఆలస్యమైనప్పటికి జనం ఉత్సాహంగా రాత్రి 10 గంటల వరకు అక్కడు ఉండడం గమనార్హం. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోకి వచ్చేసరికి వారికి ఇరుపార్టీల శ్రేణులు ఘనస్వాగతం పలికారు. పాలంగి, ఉండ్రాజవరం, మోర్త, దమ్మెన్ను, కానూరు, డి.ముప్పవరం మీదుగా నిడదవోలు వెళ్లారు. ఉండ్రాజవరంలో మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. నిడదవోలు రూరల్ మండలం మునిపల్లి గ్రామంలో మహిళలు నేతలిద్దరిపై పూలు జల్లారు. డి.ముప్పవరంలో కూడ ప్రజలకు అభివాదం చేస్తూ సుమారు 7.45 గంటలకు నిడదవోలు పట్టణంలో గణేష్‌చౌక్ సెంటర్‌లో ఉన్న వారాహి విజయభేరి సభకు చేరుకున్నారు. ఉండ్రాజవరం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మోటార్ సైకిళ్లపై కాన్వాయ్ వెంట వచ్చారు. ఒకే వాహనంపై రోడ్‌షో నిర్వహిస్తున్న చంద్రబాబు, పవన్‌లకు ప్రజలు విజయ సంకేతం చూపారు. 8.45 గంటలకు వారాహి వేదిక మీదకు వచ్చిన టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, నిడదవోలు నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. 8.45 గంటలకు ప్రారంభమైన వారాహి విజయభేరి సభ 9.50 గంటలకు ముగిసింది. 20 వేల మందికిపైగా జనం రాకతో వారాహి విజయభేరి సభ విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కేఎస్ జవహర్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, నిడదవోలు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి భోగవల్లి ప్రసాద్, సుజయ కృష్ణరంగారావు, గన్ని వీరాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, పితాని సత్యనారాయణ, బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, బొమ్ములు దత్తు తదితరులు పాల్గొన్నారు.



మీకు మేమున్నాం : బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు



సభకు హాజరైన టీడీపీ నాయకులు



అభిమాన జెండా : జనసేన జెండాలతో పవన్ అభిమానులు





పవన్ అన్న వెంటే : పవన్ చిత్రాలతో యువత

నేడు అంబాజీపేట, అమలాపురంలలో

బాబు, పవన్ షో!

అమలాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రజాగళం పేరుతో గురువారం టీడీపీ,జనసేన అధినేతలు నారా చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ రోడ్ షో,బహిరంగ సభలు నిర్వహించనున్నారు.అధినేతల ఎన్నికల ప్రచార కార్యక్రమానికి అంబాజీపేట,అమలాపురం ప్రాంతాలు వేదిక కానున్నాయి. నిడదవోలులో బుధవారం రాత్రి బహిరంగ సభ అనంతరం తిరుమలసాయి కల్యాణమండపంలో బస చేస్తారు.ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకూ రంజాన్ వేడుకల్లో పాల్గొంటారు.1.30 గంటల వరకు పార్టీ నాయకులతో సమీక్ష, చేరికలు ఉంటాయి. అనంతరం 2.30 గంటల వరకూ గంట పాటు భోజన విరామం. పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 3 గంటలకు బ్రాహ్మణగూడెం నుంచి హెలికాఫ్టర్‌లో చంద్రబాబు బయలుదేరతారు. పవన్ కల్యాణ్ రాజమహేంద్రవరంలోని హోటల్ షెల్టాన్ నుంచి బయలుదేరతారు. వీరిద్దరూ గురువారం మధ్యాహ్నానికి అంబాజీపేటలో వేర్వేరుగా ఏర్పాటుచేసిన హెలిపాడ్‌లకు చేరుకుంటారు. జనసేనకు పట్టున్న అమలాపురం, పి.గన్నవరం నియోజకవర్గాల్లో తొలి విడత పర్యటనలో భాగంగా ఇద్దరు నేతలు గురువారం పర్యటించి ఆయా పార్టీల కేడర్‌లో జోష్ నింపునున్నారు.ఈ సభలను విజయవంతం చేయాలని కోరుతూ ఏర్పాటుచేసిన ప్రచార రథాలను జనసేన నేత ఆకుల బుజ్జి ఆధ్వర్యంలో టీడీపీ అమలాపురం అభ్యర్థి ఆనందరావు ప్రారంభించారు. బుజ్జి ఆధ్వర్యంలో మోటారు సైకిల్ ర్యాలీ కూడా చేపట్టారు.ఎక్కడికక్కడే టీడీపీ, జనసేన నాయకులు గురువారం జరిగే ఉభయ నేతల సభకు భారీగా జనాన్ని తరలించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. అంబాజీపేటలో బహిరంగ సభ ముగిసిన తరువాత చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఒకే వాహనంలో అక్కడి నుంచి రోడ్ షో నిర్వహిస్తూ అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిర్వహించే సభాస్థలికి చేరుకుంటారు. సుమారు 6 కిలోమీటర్ల మేర జరిగే రోడ్ షోకి జనం భారీగా హాజరవుతారని అంచనా వేస్తున్నారు. అమలాపురం బహిరంగ సభ ముగిసిన తరువాత టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కిమ్స్‌లో నైట్‌హాల్ట్ చేస్తారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు చంద్రబాబు కిమ్స్‌లోనే ఉండి అమలాపురం లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పార్టీ పరిస్థితులపై జిల్లా నాయకులతో చర్చిస్తారని సమాచారం.

రాత్రి బస ఇక్కడే..

నిడదవోలులోని శ్రీ తిరుమల సాయి కళ్యాణ మండపంలో చంద్రబాబు బుధవారం రాత్రి బస చేశారు. గురువారం ఉదయం జిల్లా నేతలతో సమీక్షించి అంబేద్కర్ కోనసీమ జిల్లాకు వెళతా రు.జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కారులో బయలుదేరి రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌లో రాత్రి బస చేశారు.

పసుపు చంద్రయ్య

తెలుగుదేశం అంటే ప్రాణం. ఆనాడు అన్న ఎన్‌టీఆర్ నుంచి నేడు చంద్రబాబు వరకు ఎక్కడ టీడీపీ సభలు, సమావేశాలు జరిగినా అతను విధిగా హాజరవుతాడు.. అతని వస్త్రాలే కాదు.. బండి సైతం పసుపు మయం. చాగల్లు మండలం నందింగంపాడుకు చెందిన చిట్టూరి జలచంద్రయ్య బుధవారం నిడదవోలులో గణేష్‌చౌక్ సెంటర్‌లో జరుగుతున్న వారాహి విజయభేరి సభకు తాను మోటారుసైకిలును సైతం పసుపు మయం చేసుకుని జయహో చంద్రన్నా... జయహో పవనన్నా.. అంటూ ఇలా సభకు తరలి వచ్చారు.







పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ జగదీశ్, డీఎస్పీలు, ఆటోవాలాలు

సమాజసేవలో ఆటోవాలాలు భాగస్వాములు కావాలి

ఎస్పీ జగదీశ్ వినూత్న ప్రయోగం

ఊరెళితే డయల్ 94932 06371

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సమాజానికి మేలు చేసే విషయంలో ఆటోవాలాలు భాగస్వాములు కావాలని ఎస్పీ జగదీశ్ పిలుపునిచ్చారు. రహదారి, ఇళ్ల తదితర వాటికి సంబంధించిన భద్రతపై ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. హెల్మెట్, సీట్ బెల్టు ధరించడం, లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్ ఎంఎస్) ద్వారా ఇంటికి భద్రత కల్పించుకోవడం, అతివేగం ప్రమాదకరం వంటి అంశాలకు సంబంధించి సుమారు 5 వేల పోస్టర్లను ఆవిష్కరించి పలు ఆటోలకు స్వయంగా ఎస్పీ అతికించారు.భద్రత అంశాలపై ప్రజలను చైతన్యం చేయాలని ఆటో డ్రైవర్లను కోరారు. ప్రజలు తమ ప్రయాణాలకు ఆటోలను ఎక్కువగా ఆశ్రయిస్తుంటారని, అందువల్ల భద్రత విషయాలపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 112కి లేదా దగ్గరలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏదైనా ఊరు వెళ్లే సమయంలో పోలీసులు ఉచితంగా అందించే ఎల్‌హెచ్‌ఎంఎస్ సర్వీసును ఉపయోగించుకోవడం ద్వారా దొంగతనాల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. ప్రమాదాలు జరిగిన సమయంలో బాధ్య తగా ప్రవర్తించి బాధితులను ఆస్పత్రికి చేర్చడం వల్ల ఎన్నో ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఆ విషయంలో పోలీసుల నుంచి ఎలాంటి ఇబ్బందులూ ఉండవని స్పష్టం చేశారు. ఈ ఏడాది మార్చి చివరి వరకూ జిల్లాలో 169 ప్రమాదాలు సంభవించగా 60 మంది చనిపోయారన్నారు.ద్విచక్ర వాహనాల ప్రమాదాలు 74 ఉండగా 24 మంది ప్రాణాలు కోల్పోయారని, కార్లు తదితర లైట్ మోటారు వెహికిల్స్ వల్ల 44 ప్రమాదాలు జరగ్గా 10 మంది దుర్మరణం చెందారని తెలిపారు. హెల్మెట్ పెట్టుకోకపోవడం, సీట్ బెల్టు ధరించకపోవడం కారణంగానే మృతుల సంఖ్య ఎక్కువగా ఉంటోందన్నారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించడాన్ని వాహన చోదకులు అలవాటు చేసుకోవాలన్నారు.ద్విచక్ర వాహనంపై ట్రిపుల్ రైడింగ్‌ని తీవ్రంగా పరిగణిస్తామన్నారు. ఆటోవాలాలు మితిమీరిన విధంగా ఎక్కించుకో వద్దన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ కోసం 94932 06371, 99084 54580 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్ర మంలో అడిషనల్ ఎస్పీలు ఎస్ఆర్.రాజశేఖర్‌రాజు, టి.సర్కా ర్, ఎల్.చెంచిరెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగులకు అందని వేతనాలు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రియల్ 10 : డైరెక్టరీ ఆఫ్ సెకండరీ హెల్త్‌లో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులకు నేటికీ వేతనాలు చెల్లించకపోవడంతో వారంతా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్‌లో ఉన్న వైద్య ఉద్యోగులను డైరెక్టరీ ఆఫ్ సెకండరీ హెల్త్‌లోకి తీసుకొచ్చారని, అయితే 010 పద్దు ద్వారా జీతాల చెల్లింపులో జాప్యం ఉద్యోగులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఉగాదికైనా జీతాలు వస్తాయని ఎదురుచూసినా రాలేదని, రంజాన్‌కు కూడా జీతాలు వచ్చే అవకాశం కనిపించడంలేదన్నారు. జీతాలు రాక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెగ్యులర్ ఉద్యోగులు సుమారు 550 మంది, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు మరో 650 మందికి ఆర్థిక అవస్థలు తప్పడంలేదన్నారు. తక్షణమే జీతాలు చెల్లించాలని కోరారు.

నేడు రంజాన్



రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10: ముస్లిం సోదరులు రంజాన్ పండుగను గురువారం నిర్వహించనున్నారు. గురువారం తెల్లవారుజామున ఉపవాస దీక్షలు ముగుస్తాయి. ఈ సందర్భంగా రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకునేందుకు ముస్లిం సోదరులు ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మసీదులను ముస్తాబు చేశారు. మసీదులన్నీ విద్యుద్దీపాలతో అలంకరించారు. రాజమహేంద్రవరంలో రాయల్ మాస్క్ పెద్ద మసీదుతో పాటు అన్ని మసీదులను రంజాన్‌కు సిద్ధమయ్యాయి.



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత చిత్రంలో జేసీ తేజ్‌భరత్

సమన్వయంతో పనిచేద్దాం : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10: సమన్వయంతో పని చేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేద్దామని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత సూచించారు. రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్‌లో ఏడు నియోజకవర్గాల ఏఎల్‌ఎంటీల శిక్షణకు బుధవారం హాజరై మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ నియోజక మాస్టర్ ట్రైనర్లు నిర్వర్తించే పాత్ర అత్యంత కీలకమన్నారు. మాస్టర్ ట్రైనర్లు అందజేసే సమగ్ర సమాచారం, దిశా నిర్దేశం ద్వారా మాత్రమే ఎన్నికల విధుల్లో ప్రిసైడింగ్ , సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సహాయక సిబ్బంది పనితీరు ఆధారపడుతుందన్నారు. మీరు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు సమగ్రంగా అధ్యయనం చేసుకోవడం, వాటిని ఆచరణ సాధ్యం చేయడంలో మీ అనుభవం అ్యతంత ప్రాధాన్యత కలిగి ఉంటుందన్నారు. ఎన్నికల్లో వినియోగించే ఈవీఎం, ఇతర అనుబంధ పోలింగ్ యూనిట్స్ పనితీరు ,డిస్ట్రిబ్యూషన్, పోలింగ్ అనంతరం రిసెప్షన్ కేంద్రంలో కీలకమైన బాధ్యతలు నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు ఈనెల 15న తొలి శిక్షణ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.సమావేశంలో జేసీ తేజ్‌భరత్, కమిషనర్ దినేష్ కుమార్, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

అణగారిన వర్గంగానే రజకులు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కట్లయ్య



చిన్నాయిగూడెంలో విలేకరుల సమావేశంలో కట్లయ్య

దేవరపల్లి, ఏప్రిల్ 10: రజకులు అన్ని రంగాల్లోనూ అణగారిన వర్గంగానే మిగిలిపోతున్నారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని చిన్నాయిగూడెంలో రజక సంఘం నాయకుడు గుంటుపల్లి నాంచారయ్య సంస్మరణ సభకు ఆయన విచ్చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రజకుల సమస్య సాధనకు నాంచారయ్య ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం గ్రామంలో రజకుల సమస్యలను కట్లయ్య దృష్టికి తీసుకొచ్చారు. చెరువులను కట్లయ్య సందర్శించి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడానికి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. రజకులంతా ఐక్యంగా ఉంటేనే సమస్యలు సాధించుకోగలమని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక సంఘం ఉపాధ్యక్షుడు బూరుగుపల్లి సత్యనారాయణ, పల్లంట్ల సుబ్బారావు, పల్లంట్ల గాంధీ, కంబాల నాగేశ్వరరావు, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేత



గోపాలపురం, ఏప్రిల్ 10: మండలంలోని కోమటికుంట గ్రామంలో దివ్యాంగుడు వరిగేటి నాగబాబుకు టీడీపీ మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ వీల్‌చైర్‌ను అందజేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలో పర్యటించిన మద్దిపాటి వెంకట్రాజుతో వీల్‌చైర్ కావాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా ఇవ్వలేదని నాగబాబు వాపోయాడు. అందుకు స్పందించిన మద్దిపాటి తన స్వీయనిధులతో వీల్‌చైర్‌ను సమకూర్చారు. దానిని బుధవారం నాగబాబుకు సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొయ్యలమూడి మోహన్, జ్యేష్ట శ్రీధర్, వడ్లమూడి రమేష్, కట్రగడ్డ సురేష్, ప్రసాద్‌బాబు, కొర్లపాటి రాము, జ్యేష్ట శ్రీను పాల్గొన్నారు.

గోపాలపురంలో కోతుల పట్టివేత

గోపాలపురం, ఏప్రిల్ 10: కొన్నిరోజులుగా కోతుల సంచారం, దాడులతో ఇబ్బంది పడుతున్న గోపాలపురం ప్రజలకు పంచాయతీ అధికారులు బుధవారం ఉపశమనం కలిగించారు. కోతులు గ్రామంలో విచ్చలవిడిగా సంచరిస్తూ ఇద్దరు చిన్నారులపై దాడి చేసి గాయపరిచాయి. దీంతో స్పందించిన పంచాయతీ అధికారులు బుధవారం కోతులను బోనులో బంధించి అటవీ ప్రాంతానికి తరలించారు. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

తనిఖీల్లో రూ.1.20 లక్షలు స్వాధీనం

కొవ్వూరు, ఏప్రిల్ 10: కొవ్వూరు మండలం మద్దూరు వంతెన సమీపంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో బుధవారం సాయంత్రం రసీదులు లేని రూ.1.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. పెరవలి మండలం అజ్జరం నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న మనికి సురేష్ కారులో రసీదులు లేని నగదును గుర్తించి సీజ్ చేశామన్నారు. సదరు నగదును కొవ్వూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో స్వాధీన పరిచామని అధికారులు తెలిపారు.

ఉండ్రాజవరం మండల పరిషత్ సమావేశం

ఉండ్రాజవరం, ఏప్రిల్ 10: ఉండ్రాజవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశంలో పలు అంశాలపై సమీక్ష జరిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీడీవో నరేంద్రరెడ్డి, తహశీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ



గోపాలపురం, ఏప్రిల్ 10: అన్నివర్గాల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి, దొండపూడి కమిటీ అధ్యక్షుడు ముత్యాల రాయుడు అన్నారు. మండలంలోని దొండపూడిలోని మసీదులో 110 ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్‌లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామతులసి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సంతోషంగా రంజాన్‌పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు రంజాన్ తోఫా కిట్‌లు పంపిణీ చేశారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక క్రిస్మస్ కానుక, రంజాన్‌తోఫా, సంక్రాంతి కానుకలను జగన్ పక్కకు పెట్టారన్నారు. కార్యక్రమంలో బండారి గనిరాజు, పంది సోమరాజు, పిల్లి కృష్ణ, వెల్లంకి జయశివసూర్యం, ముప్పిడి అనీల్‌కుమార్, రౌతు సతీష్ పాల్గొన్నారు.

టీడీపీ కండువా తీసేయాలి

- బిక్కవోలు నుంచి బీజేపీ అనపర్తి అభ్యర్థి ప్రచారం ప్రారంభం
- అడ్డుకున్న తెలుగుదేశం నాయకులు.. వాగ్వాదం



బిక్కవోలులో టీడీపీ కండువాలతో ప్రచారం చేయవద్దంటూ బీజేపీ అభ్యర్థి శివరామకృష్ణంరాజును అడ్డుకుంటున్న తెలుగుదేశం నాయకులు

బిక్కవోలు, ఏప్రిల్ 10: తూర్పుగోదావరి జిల్లా అనపర్తి బీజేపీ అభ్యర్థిగా ప్రకటించిన ఎం.శివరామకృష్ణంరాజు బుధవారం బిక్కవోలు నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అయితే ఆయన టీడీపీ కండువాలతో ప్రచారం ప్రారంభించడంతో పార్టీ గ్రామ అధ్యక్షుడు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి ఆధ్వర్యంలో నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తమ నేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని అనపర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారని, బీజేపీ నాయకులు మిమ్మల్ని అభ్యర్థిగా ప్రకటించారని అయితే ఈ సీటుపై ఇంకా తర్జన భర్జనలు జరుగుతున్నాయని, అందువల్ల తమ పార్టీ కండువాలు కప్పుకుని ప్రచారం చేయవద్దని రాజుతో వాగ్వాదానికి దిగారు. రామకృష్ణారెడ్డి న్యాయం కోసం నల్లమిల్లికి అంటూ టీడీపీ కండువాలతోనే ప్రచారం చేస్తున్నారని, ఈ దశలో మీరు తమ పార్టీ కండువాలు కప్పుకుని ప్రచారం చేస్తే సహించబోమన్నారు. బీ-ఫారం ఎవరికి ఇస్తే అప్పుడు తామంతా వారి వెంటే వుంటామన్నారు. దీంతో చేసేది లేక శివరామకృష్ణంరాజు కప్పుకున్న టీడీపీ కండువాను తీసి వేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుణ్ణం రమేష్, గొర్రెల త్రిమూర్తులు, రాయుడు రామచంద్రరావు, పెంటమాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని గద్దె దించడమే లక్ష్యం: శివరామకృష్ణంరాజు

వైసీపీ అరాచక పాలనను గద్దె దించడమే కూటమి లక్ష్యమని అనపర్తి బీజేపీ అభ్యర్థి ఎం.శివరామకృష్ణంరాజు తెలిపారు. బుధవారం ఆయన బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు జరిపి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి, కేంద్రంలో బీజేపీ విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తంచేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమరిపాలెంలో 'న్యాయం కోసం నల్లమిల్లి'

అనపర్తి ఏప్రిల్ 10: నియోజకవర్గం మొత్తం ఒక ఎత్తయితే కొమరిపాలెం ఒక ఎత్తని, ఇక్కడ ప్రజలు ప్రేమిస్తే ప్రేమనందిస్తారని అణచివేయాలి చూస్తే అణచివేస్తారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా అనపర్తి అసెంబ్లీ సీటును కోల్పోయిన ఆయన చేపట్టిన న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమాన్ని బుధవారం బిక్కవోలు మండలం కొమరిపాలెంలో నిర్వహించారు. తన తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు పడాల రాము సునీత దంపతులు వారితో పాటు గ్రామంలో పర్యటించారు.

రాక్షస పాలనను అంతమొందించాలి

- భావితరాల భవితకు కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలి
- టీడీపీ-జనసేన-బీజేపీ కొవ్వూరు అభ్యర్థి ముప్పిడి



కొవ్వూరులో ప్రచారం నిర్వహిస్తున్న ముప్పిడి, ద్విసభ్య కమిటీ

కొవ్వూరు, ఏప్రిల్ 10: వైసీపీ రాక్షసపాలనను అంతమొందించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయని, భావితరాల భవితకు కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరులోని 9వ వార్డు గౌతమీనగర్, అచ్చాయమ్మకాలనీల్లో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరిల ఆధ్వర్యంలో బుధవారం ఆయన బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓటేసి గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. రాష్ట్రాభివృద్ధికి వెచ్చించాల్సిన నిధులను దారి మళ్లించి దోచుకోవడం, దాచుకోవడం తప్ప చేసిందేమి లేదన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు, టీడీపీ పట్టణ, మండలాధ్యక్షులు దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, నాయకులు పిల్లలమర్రి మురళీకృష్ణ, సూరపనేని చిన్ని, పొట్రు శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు పరిమి రాధాకృష్ణ, ఎం.రామచంద్రరావు, బీవీ ముత్యాలరావు, టీఎన్వీ రమణమూర్తి, విజయవాణి, జనసేన నాయకులు డేగల రాము, కె.నవ్య, గంగుమళ్ళ స్వామి, కౌన్సిలర్ బొండాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

రంజాన్ మాసం చివరిరోజు సందర్భంగా బుధవారం కొవ్వూరు మసీదు వద్ద ముస్లింలకు పెండ్యాల అచ్చిబాబు, ముప్పిడి వెంకటేశ్వరరావు మిఠాయిలు పంచి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ద్విసభ్య కమిటీతోపాటు జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని గజ్జరం గ్రామంలో కూటమి అభ్యర్థి ముప్పిడి



నిడదవోలులో మహిళలకు గాజు గ్లాసు గుర్తును చూపిస్తున్న దుర్గేష్

వెంకటేశ్వరరావు సతీమణి ముప్పిడి సుజాత ఇంటింటికీ బాబు షూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాకర్ల వంశీ, దండమూడి శేషు, ఓలేటి హరేరాం, మద్దిపాటి శ్రీను, కృష్ణ, దత్తుడు, సత్యన్నారాయణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన కాశీరేవు వంతెన నిర్మాణానికి కృషి: దుర్గేష్

నిడదవోలులోని చినకాశీరేవులో వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం నిడదవోలులోని ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులతో భేటీ అయ్యారు. ఈ ఆయన మాట్లాడుతూ గాజు గ్లాసు గుర్తుపై ఓటువేసి తనను గెలిపించాలన్నారు. నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. పందలపర్రు గ్రామానికి చెందిన జనసేన అధ్యక్షుడు కర్రి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామ వైసీపీ నాయకులు కొప్పు వెంకటేశ్వరరావు, కోరుకొండ బాపన్న, కోటిపల్లి రాంబాబు, గోపవరం గ్రామానికి చెందిన తోలేటి కృష్ణ తదితరులు దుర్గేష్ సమక్షంలో జనసేనలో చేరారు.

టీడీపీ మిత్రపక్షాలు ఇంటింటా ప్రచారం

దేవరపల్లి, ఏప్రిల్ 10: తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతలు కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. దేవరపల్లిలోని మారుతినగర్, వినాయకుడి గుడి, మెరక వీధిలో పర్యటించి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందజేశారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా మద్దిపాటి వెంకట్రాజుకి, ఎంపీ అభ్యర్థిగా దగ్గుబాటి పురందరేశ్వరికి ఓట్లు వేసి గెలిపించాలని టీడీపీ మండలాధ్యక్షుడు ఆండ్రూ అనీల్, గన్నమని హరికృష్ణ కోరారు. కార్యక్రమంలో కాట్రు భీమరాజు, యాగంటి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి రాంబాబు, అనపర్తి వాసు, ముళ్ళపూడి సత్యనారాయణ, పిన్నమనేని నవీన్, కంబాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

- రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రుద్రరాజు

కొవ్వూరు, ఏప్రిల్ 10: కాంగ్రెస్ పార్టీ హయాంలోనే దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, భవిష్యత్‌లోనూ అభివృద్ధి చెస్తామని రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. నిడదవోలులోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యధిక లోక్‌సభ, రాజ్యసభ స్థానాలు ఉన్నా ప్రత్యేక హోదా తేవడంలో జగన్ విఫలమయ్యారని, రైతుల నల్లచట్టాలు, ఎన్‌సీపీ లాంటి బిల్లులపై బీజేపీకి మద్దతిచ్చారని విమర్శించారు. బీజేపీకి జగన్, చంద్రబాబు, పవన్ అంతా ఒక్కటేనన్నారు. మతాలు, కులాలు, ప్రాంతాల పేరున చిచ్చు రేపుతోందన్నారు. పథకం ప్రకారం రాజ్యాంగాన్ని మార్చేందుకు, మైనార్టీలకు కాంగ్రెస్ కల్పించిన 4శాతం రిజర్వేషన్‌ను తీసెసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని రుద్రరాజు అన్నారు. సమావేశంలో నిడదవోలు, కొవ్వూరు ఇన్‌చార్జిలు పెద్దిరెడ్డి సుబ్బారావు, అరిగెల అరుణకుమారి, పట్టణాధ్యక్షుడు కారింకి వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన కాంగ్రెస్ నాయకుల రిలే దీక్షలు

కొవ్వూరు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టును స్థానికులకే ఇవ్వాలని పార్టీ మండలాధ్యక్షుడు జొన్నకూటి రవికుమార్ ఆధ్వర్యంలో స్థానిక వాటర్‌ట్యాంకు వద్ద చేపట్టిన రిలేదీక్షలను డీసీసీ మాజీ అధ్యక్షుడు రఫీయుల్లాబేగ్ నిమ్మరసమిచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి కొవ్వూరులో స్థానికులే పోటీచేశారని, నియోజకవర్గం రిజర్వు కావడంతో స్థానికేతరులు టిక్కెట్టు తెచ్చుకోవడంతో స్థానికులు నష్టపోతున్నారన్నారు. జిల్లా అధ్యక్షురాలు గాని, ఎంపీ అభ్యర్థి గాని దీక్ష విరమింపజేసే ప్రయత్నం చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. రవికుమార్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ప్రధాని కావాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి అరిగెల అరుణకుమారికి నియోజకవర్గంలో ఓటు లేదని, బంధువర్గం లేదని, అటువంటి వారిని ఇక్కడ నుంచి పోటీలో నిలబెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో చాగల్లు మాజీ అధ్యక్షుడు మట్టా సుబ్బారావు, సాకా పుల్లారావు, కొడమంచిలి చంద్రశేఖర్, మహిళలు పాల్గొన్నారు.



దేవరపల్లి: దుద్దుకూరులో సమావేశంలో మాట్లాడుతున్న మార్టిన్ లూథర్

కాంగ్రెస్ గోపాలపురం అభ్యర్థిగా మార్టిన్ లూథర్

దేవరపల్లి, ఏప్రిల్ 10: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనను అధిష్ఠానం ప్రకటించిందని, పార్టీ విజయానికి కృషి చేయాలని మార్టిన్ లూథర్ అన్నారు. మండలంలోని దుద్దుకూరు, యర్నగూడెం గ్రామాల్లో పార్టీ నాయకులను ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని నాయకులందరినీ కలుస్తానని, ప్రతి గ్రామంలోనూ ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను ఓటర్లకు వివరిస్తామన్నారు. రాష్ట్రంలోను, కేంద్రంలోను ఒకే పార్టీ అధికారంలో ఉంటే రాష్ట్రానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వెలగా రామకృష్ణ, కాకర్ల శ్రీహరిబాబు, గుత్తికొండ సూరిబాబు, పాక చిన్నబ్బులు, బొల్లిన రాజాచౌదరి తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ భారత్ పార్టీ రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థిగా కిరణ్‌కుమార్



ధవళేశ్వరం, ఏప్రిల్ 10: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జై భీమ్ భారత్ పార్టీ తరుపున రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థిగా ధవళేశ్వరానికి చెందిన దళిత నాయకుడు గునిపే కిరణ్‌కుమార్ పోటీ చేయనున్నారు. విజయవాడలో జరిగిన సమావేశంలో పార్టీ అధ్యక్షుడు జడ శ్రవణ్‌కుమార్ ఈ మేరకు ప్రకటించినట్లు కిరణ్‌కుమార్ తెలిపారు. అంబేడ్కర్ ఆశయాల సాధనకు ఎస్సీఎస్టీ, బీసీ మైనార్టీ బడుగు, బలహీన వర్గాలు తనకు మద్దతు తెలపాలని కోరారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు రాట ముహూర్తం

ధవళేశ్వరం, ఏప్రిల్ 10: ధవళేశ్వరం ఇరిగేషన్ కార్యాలయాల వద్ద బ్యారేజ్ కాలనీలోని కోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలకు బుధవారం పందిరి రాట ముహూర్తం చేశారు. పోలవరం చీఫ్ ఇంజనీర్ బి.సుధాకర్‌బాబు దంపతులు ప్రత్యేక పూజలు చేసి రాట వేశారు.

రాజానగరంలో 8 మంది వలంటీర్ల రాజీనామా

రాజానగరం, ఏప్రిల్ 10: రాజానగరంలో పలువురు గ్రామవలంటీర్లు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి మేకా ప్రసాద్‌బాబుకు బుధవారం అందజేశారు. జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి నాయకుల వైఖరి వల్ల తమ మనోభావాలు దెబ్బతిన్నాయని అందుకే రాజీనామా చేశామని వారు పేర్కొన్నారు. కాగా మరో రెండు రోజుల్లో నియోజవర్గ వ్యాప్తంగా ఉన్న గ్రామ వలంటీర్లంతా మూకుమ్మడి రాజీనామాలు చేసే యోచనలో ఉన్నట్టు తెలిసింది.

ధవళేశ్వరంలో నేత్ర దానం

ధవళేశ్వరం, ఏప్రిల్ 10: స్థానిక గంజాల వీధికి చెందిన గవర జోగినాయుడు(85) బుధవారం ఉదయం ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. ఆయన నేత్రాలు మరొకరి జీవితంలో వెలుగులు నింపాలనే ఉద్దేశ్యంతో ఆయన కుమారులు వరప్రసాద్, రమేష్‌లు నిర్ణయించారు. దీంతో నిడదవోలులోని రామయ్యమ్మ ఇంటర్నేషల్ ఐ బ్యాంక్ సిబ్బంది వచ్చి మృతి చెందిన జోగినాయుడు కార్నియాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన కుమారులను పలువురు అభినందించారు.

ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోండి

రాజానగరం, ఏప్రిల్ 10: ఓటర్లంతా తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని ఎంపీడీవో జ్యోతిర్మయి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈవో రామన్నదొర మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనసేన ప్రచార వాహన ఫ్లెక్సీలు ధ్వంసం

ఇద్దరు యువకులపై కేసు నమోదు



రాజానగరం, ఏప్రిల్ 10: జనసేన పార్టీ ప్రచార వాహనానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన ఘటనలో ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. మండలంలోని తూర్పుగోన గూడెం గ్రామానికి చెందిన పైన దుర్గారావుకు చెందిన ఆటోను జనసేన పార్టీ ప్రచారానికి అద్దెకు తీసుకున్నారు. బుధవారం తెల్లవారుజామున ఇంటి వద్ద ఉన్న ఆటోపై ఏర్పాటు చేసిన జనసేన పార్టీ ఫ్లెక్సీలను గుర్తుతెలియని యువకులు చించివేశారు. ఈ సమయంలో శబ్దం రావడం గమనించిన ఆటో డ్రైవర్ భార్య బయటకు వచ్చి చూసేసరికి పరుగులు తీశారు. ఆటో డ్రైవర్ దుర్గారావు ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ పుటేజీల ఆధారంగా తూర్పుగోనగూడెం గ్రామానికి చెందిన వీరమళ్ల జయ భువనసాయి, శ్రీరామ్‌నగర్‌కు చెందిన యర్రా తేజేష్‌లను నిందితులుగా గుర్తించారు. ఈ మేరకు ఎస్ఐ పవన్ కేసు నమోదు చేశారు.

రైతులను సత్కరించుకోవడం అందరి బాధ్యత

- ఆంధ్రా షుగర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అచ్చిబాబు
- సుంకవల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు



సత్కారాలు పొందిన వారితో పెండ్యాల అచ్యుతరామయ్య

చాగల్లు, ఏప్రిల్ 10: రైతులు దేశానికి వెన్నెముక అని, అందరికీ అన్నం పెట్టే రైతును గౌరవించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని ఆంధ్రా షుగర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు) అన్నారు. సుంకవల్లి వెంకటరత్నం, మంగరాజు దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకన్నచౌదరి, శేషకుమారి దంపతులు ఉగాది పురస్కారాలు అందిస్తూ రైతులను, అధికారులను, విద్యార్థులను సత్కరించడం అభినందనీయమన్నారు. మండలంలోని మార్కొండపాడు శ్రీనిలయంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ రైతులు గవిర్ని రాజారావు(పురుషోత్తపల్లి), కరుటూరి వెంకటచౌదరి(తాడిపర్రు), చింతలపూడి రాజేష్(పెరవలి), యాతన వెంకట్రావు(ధర్మవరం), మోదవలస రాజారావు(తిరుగుడుమెట్ట), నిమ్మగడ్డ సూరిబాబు(నెలటూరు), ఉత్తమ అధికారులు పైడిమర్రి చంద్రశేఖర్(ఏఈ, కొవ్వూరు), సీహెచ్ఎస్ఆర్ కేఎస్ శాస్త్రి(ఏఈ పంచాయతీరాజ్), ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేండ్ర వీరవెంకట శ్రీనివాస్ తదితరులను ముఖ్య అతిథులు సత్కరించారు. కార్యక్రమానికి విచ్చేసిన కాటకోటేశ్వరం శ్రీరామ ఆశ్రమం శ్రీరామదాసి అమ్మ మాట్లాడుతూ ధర్మబద్ధంగా జీవితం సాగించాలని, పురాణ పురుషుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, టీడీపీ నాయకులు నాదెళ్ల శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షలు ఇస్తేనే.. డెడ్‌బాడీ ఇస్తాం

- ఓ కార్పొరేట్ ఆస్పత్రి దాష్టీకం
- వైరల్ ఫీవర్‌తో ఆసుపత్రిలో చేరిక
- రూ.7.50 లక్షల వరకూ ఖర్చు చేసిన బాధితులు
- మంగళవారం రాత్రి మృతి
- మృతదేహం అప్పగించని ఆసుపత్రి
- మిగిలిన రూ.2 లక్షలు కట్టాలని డిమాండ్
- కన్నీరు మున్నీరవుతున్న కుటుంబీకులు
- పోలీసులకు ఫోన్ చేసినా స్పందించని వైనం



ఆస్పత్రి ప్రతినిధిని అభ్యర్థిస్తున్న కుటుంబీకులు



పాటి మోహన్‌రావు (ఫైల్ ఫొటో)

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రి అమానుష తీరు మానవత్వాన్ని కూడా కన్నీరు పెట్టించింది. వైద్యం కోసం వచ్చిన ఓ పేద వ్యక్తి మృతి చెందితే.. రూ.2 లక్షలు చెల్లిస్తేనే ఇస్తామంటూ మృతదేహాన్ని గదిలో పెట్టి తాళం వేయడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరవుతున్నారు. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంతర్వేదికి చెందిన పాటి మోహన్‌రావు(58) వ్యవసాయం చేస్తుంటారు. ఆయనకు వైరల్ జ్వరం సోకడంతో గత నెల 23న కిమ్స్(బొల్లినేని) హాస్పటల్స్‌కి తీసుకొచ్చారు. మూడు రోజులు ఐసీయూలో ఉంచి వైద్యం అందించారు. తర్వాత రూమ్‌కి మార్పు చేశారు. మళ్లీ పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్ పెట్టారు. కిడ్నీలు పని చేయడం లేదని డయాలసిస్ చేశారు. న్యూమోనియా తీవ్రంగా ఉందని చెప్పారు. ఈ క్రమంలో మోహన్‌రావు చనిపోయారని మంగళవారం రాత్రి 8గంటల ప్రాంతంలో కుటుంబీకులకు చెప్పారు. ఇంకా రూ.2లక్షలు చెల్లిస్తే మృతదేహాన్ని అప్పగిస్తామన్నారు. అయితే అప్పటికే రూ.7.50లక్షల వరకూ చెల్లించామని.. ఇక తమ వద్ద డబ్బులు లేవని చెప్పడంతో వారితోనే ఫ్రీజర్ బాక్సు రప్పించి దానిలో మృతదేహాన్ని ఉంచారు. ఆ ఫ్రీజర్ బాక్సును ఓ గదిలో పెట్టి తాళం వేశారు. డబ్బులు కడితేనే మృతదేహం ఇస్తామని కరాఖండిగా చెప్పారు. దీంతో మృతదేహం ఇస్తే తీసుకెళ్తామని మంగళవారం రాత్రి నుంచి ఆస్పత్రి వాళ్లను బాధితులు బ్రతిమలాడుతూనే ఉన్నారు. అయినా ఫలితం లేకపోవడంతో బుధవారం రాత్రి మృతుడు మోహనరావు కూడా వచ్చిన కొంతమంది గురువారం వస్తామని వెనుతిరిగి స్వగ్రామానికి వెళ్లిపోయారు. అయితే గురువారం బాధితులు మృతదేహం కోసం ధర్నా చేసే అవకాశముందని సమాచారం.



న్యాయం చేయండి : కిషోర్ కుమార్, కుమారుడు

మాది పేద కుటుంబం. మంచి వైద్యం అందుతుందని అప్పులు చేసి డబ్బులు చెల్లించినా ఫలితం లేకపోగా మృతదేహాన్ని ఇవ్వ మంటున్నారు. రెండు రోజుల కిందట నుంచే పరిస్థితి విషమంగా ఉన్నా ఏదోకటి చేస్తూ మమ్మల్ని నమ్మించారు. 30 గంటలు గడిచి పోయింది. మా నాన్నను కనీసం చూడనివ్వడం లేదు. ఆరోగ్యశ్రీ ఎందుకు పనిచేస్తుంది. ఇది చాలా దారుణం. మాకు న్యాయం చేయాలి.

ఇదేమి ఆరోగ్యశ్రీ!

మోహన్‌రావుకు ఆరోగ్యశ్రీ కార్డు ఉంది. అయితే ఆయనకు ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయలేదు. ఆయన వ్యాధికి తమ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీలో వైద్యం చేయలేమని, ఆ వ్యాధికి ఆరోగ్యశ్రీ వర్తించే ఆస్పత్రిలో అయితే ఫలితం ఉంటుందని మెలిక పెట్టారు. ఆస్పత్రిలో చేర్చుకున్న నాటి నుంచీ రోజుకు సుమారు రూ.40 వేల వరకూ వైద్యానికి ఖర్చయింది. ఆ సొమ్ములు అప్పులు చేసి తెచ్చామని బాధితులు చెబుతున్నారు. తమ దగ్గర డబ్బులు లేవని, ఏదో రకంగా తమకు సహాయం చేయాలని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్‌కి బుధవారం రాత్రి బాధితులు ఫోన్ చేశారు. ఇప్పటి వరకూ కట్టిన సొమ్ములు ఇప్పిస్తే మంచిదని, లేకుంటే మృత దేహాన్ని అయినా అప్పగించాలని అర్థించారు.ఇంటి వద్ద మహిళలు రోదిస్తూ ఎదురు చూస్తున్నారని చెప్పారు. కానీ కోఆర్డినేటర్ నుంచి ప్రశ్నలు తప్ప ఫలితం లేకపోయింది. పోలీసులు సైతం ఏ సహాయమూ చేయలేమనడంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అనుకుంటూ ఆస్పత్రి వద్దే బాధితులు విలపిస్తూ ఉన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	కింగ్ ఆఫ్ గాడ్జిల్లా
వై.స్క్రీన్ 2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	ఓం బీం బుష్
అనన్య	డీజే టిల్లు-2

నిడదవోలు

వీ మ్యాక్స్	ప్రేమలు
రాధాకృష్ణ	భీమా
శ్రీగణపతి	ఓం బీం బుష్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి